



# విశాల భారతి

1-4-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 4


# చావైనా బతుకైనా తెలంగాణ కోసమే..!

**ప్రస్తుతం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ వివాదం తారాస్థాయికి చేరింది**

దీనిపై బీఆర్ఎస్ , కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది

బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

కేసీఆర్ తెలంగాణకు మరణ శాసనం రాశారని సీఎం మండిపడ్డారు

సభకు రాకుండా గులాబీ నేతలు తప్పించుకుతిరుగుతున్నారన్నారు

సభకు రండి నిజాలు ఏంటో తేలుద్దామని సవాల్ విసిరారు

కేసీఆర్ సభకు ఎందుకు రాలేదో కారణమే లేదని అన్నారు

కేసీఆర్ సూచనలు ఇస్తే తీసుకుందామని అనుకున్నామని తెలిపారు

03



తెలంగాణలో ప్రస్తుతం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ వివాదం తారాస్థాయికి చేరింది. దీనిపై బీఆర్ఎస్ , కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇప్పటికే కేసీఆర్ పాలమూరు ప్రాజెక్‌ట్‌ల విషయంలో కాంగ్రెస్ పూర్తిగా నెగ్లీజెన్సీగా ప్రవర్తించిందని ఆరోపణలు చేశారు. దీనిపై రంగంలోకి దిగిన సీఎం రేవంత్ ఇటీవల పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ల విషయంలో మాజీ సీఎం కేసీఆర్ , హరీష్ రావులను ఉరితీసిన తప్పులేదన్నారు. కేసీఆర్ ను కసబ్‌తో పోల్చారు.ఈ వ్యాఖ్యలతో తెలంగానలో మరోసారి నీళ్ల మంటలురాజుకున్నాయి. ఇక తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నాయి.

# అంజన్నే నన్ను కాపాడారు

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు
- స్వామివారికి నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు
- రూ. 35.19 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు
- అంజన్న తనకు పునర్జన్మ ఇచ్చారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు
- ఆంజనేయస్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు
- అంజన్న ఆశీస్సులు తెలుగు రాష్ట్రాల ప్రజలపై ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు
- ఆంజనేయ స్వామి ఒక ప్రాంత సొత్తు కాదు.. ఒకరి సొత్తు కాదని చెప్పకొచ్చారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కొండగట్టు అంజన్న తనకు పునర్జన్మ ఇచ్చారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కొండగట్టు అంజన్నను తమ ఇలవేల్పుగా కొలుస్తామని అన్నారు. ఆంజనేయస్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కొండగట్టు అంజన్న ఆశీస్సులు ఒక పార్టీకి కాకుండాతెలుగు రాష్ట్రాల ప్రజలపై ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం ఉదయం హెలికాప్టర్ లో కొండగట్టు చేరుకున్నారు.ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ ఇలవేల్పు కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తి పూర్వకంగా ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి హోదాలో ఆలయానికి వచ్చిన జనసేనానికి అర్చకులు సంప్రదాయబద్ధంగా సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం అనంతరం 2024లో పవన్ కళ్యాణ్ ఆలయాన్ని సందర్శించిన సందర్భంలో కొండగట్టు అంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని మాటిచ్చారు. ఇచ్చిన మాట



ప్రకారం రూ. 35.19 కోట్ల అంచనా వ్యయంతో టి.టి.డి. సహకారంతో దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు విచ్చేశారు.. ఉదయం 11 గంటల ప్రాంతంలో టి.టి.డి.చైర్మన్ బి.ఆర్.నాయుడు, తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గారితో కలసి ఆలయానికి చేరుకున్న మిగతా 2లో..

# ఒక్క నీటి చుక్కనూ వదలం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు
- కృష్ణా నదీ జలాల పంపకాల్లో తీరని అన్యాయం చేశారని ఆరోపించారు
- ఆంధ్రాకు 66 శాతం నీటిని రాసిచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని మండిపడ్డారు
- తెలంగాణ రైతాంగం ప్రయోజనాలను దెబ్బతీశారని విమర్శించారు
- ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేశారని ఆరోపించారు
- కాళేశ్వరం ప్రాజెక్టు కోసం పాలమూరు-రంగారెడ్డిని గాలికొదిలేశారని అన్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ శాసనసభలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కృష్ణా నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు తీరని అన్యాయం చేశారని, ఆంధ్రాకు 66 శాతం (512 టీఎంసీలు) నీటిని, తెలంగాణకు కేవలం 34 శాతం (299 టీఎంసీలు) నీటిని అంగీకరిస్తూ లిఖితపూర్వకంగా రాసిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మండిపడ్డారు. 2015 నుంచి 2020 వరకు ఏటా ఇదే విధానాన్ని కొనసాగిస్తూ తెలంగాణ రైతాంగం ప్రయోజనాలను దెబ్బతీశారని విమర్శించారు. సభలో ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత పదేళ్లలో సాగునీటి రంగంలో జరిగిన విధ్వంసాన్ని ఆయన వివరించారు. పదేళ్ల కాలంలో బడ్జెట్ అంచనాలు సుమారు రూ. 17 లక్షల కోట్లు చూపించినా, క్షేత్రస్థాయిలో ఫలితాలు శూన్యమని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం



చేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు కోసం రూ. 23,000 కోట్లు, సీతారామ ప్రాజెక్టు కోసం రూ. 8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, ఒక్క ఎకరాకు కూడా నీరందించలేకపోయారని ఎద్దేవా చేశారు. మూడు బ్యారేజీలు కూలిపోయినా, ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం 90 శాతం మిగతా 2లో..



# వెనుజులా అధ్యక్షుడును బంధించాం

- అమెరికా, వెనుజులా మధ్య నెలకున్న ఉద్రిక్తతలు
- శనివారం ఊహించని మలుపు తిరిగాయి
- వెనుజులాపై అమెరికా సైన్యం వైమానిక దాడులు
- ఆ దేశ అధ్యక్షుడ్ని బంధించినట్లు వెల్లడించింది
- అంతర్జాతీయ సమాజాన్ని ఉలిక్కి పడేలా చేసింది
- ఆయన భార్యను బంధించినట్టు ట్రంప్ ప్రకటించాంచారు
- మత్తు పదార్థాల అక్రమ రవాణా చేస్తున్నారని ట్రంప్ ఆరోపణలు

03

# పొన్నంకు శాసనమండలి చైర్మన్ క్లాస్

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల మూడవ రోజు వాడివేడిగా సాగాయి

అసెంబ్లీ లోపల ప్రతిపక్షం లేనిలోటు స్పష్టంగా కనిపించింది

అయితే శాసన మండలిలో ఆశక్తికర సన్నివేశం చోటుచేసుకుంది

మండలి చైర్మన్ నోట ప్రజాసమస్యల ప్రస్తావన వచ్చింది

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రోడ్ల ప్రమాదాలపై క్లాస్ తీసున్నారు

పొన్నం కల్పించుకుని మీ జిల్లా మంత్రికి క్లాస్ పీకండని అన్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల మూడవ రోజు వాడివేడిగా సాగాయి. అసెంబ్లీ లోపల ప్రతిపక్షం లేనిలోటు స్పష్టంగా కనిపించింది. కీలక తీర్మానాలు, కృష్ణాజలాల వివాదంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో కొనసాగింది. శాసనసభలో పరిస్థితి ఇలా ఉంటే శాసన మండలిలో ఆశక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. సహజంగా శాసనమండలి చైర్మెన్ ప్రజా సమ్యలపై పెద్దగా మాట్లడరు. సభ్యులకు మాట్లడే అవకాశం కల్పించడం,సభను సవ్యంగా నడిపించడంపైనే మండలి చైర్మెన్ దృష్టి ఉంటుంది. సభ్యుల అభిప్రాయాలకు పెద్దపీట వేసే మండలి చైర్మెన్ నోట ప్రజాసమస్యల ప్రస్తావన రావడంతో ఒక్కసారిగా అంతా షాకైయ్యారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు రోడ్ల గుంతలు,వాటి వల్ల జరుగుతున్నప్రమాదాలపై క్లాస్ తీసున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ పేరును ప్రస్తావిస్తూ, మంత్రిగారూ.. నావి కూడా రెండు మూడు సలహాలు వినండి. రాష్ట్రంలో మేజర్ యాక్సిడెంట్స్ కావడానికి కారణం ఆర్ అండ్ బి రోడ్లపైన గుంతులు అంటూ మొదలు పెట్టారు. ఇంతలో పొన్నం కల్పించుకుని మీ జిల్లా మంత్రికి క్లాస్ పీకండి అంటుండగా,ఇది అసెంబ్లీ కాబట్టి చెబుతున్నానంటూ సమాధానమిస్తూ కొనసాగించారు. రోడ్లపై గుంతల వద్దకు రాగానే వాహనాలు షడన్ బ్రేకే వేస్తున్నారు, వెంటనే వెనుక నుండి వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. చాలా వాహనాలు చట్టవిరుద్ధంగా, నడిరోడ్డు మీదనే ఆపేస్తున్నారు. దాంట్లో మీ ఆర్టీసీ బస్సులున్నాయి, లారీలున్నాయి. ఆగి ఉన్న లారీకే గుద్దుకుని చనిపోయిన వారి సంఖ్య ఎక్కువ. అలాగే ఆగి ఉన్న బస్సులను గుద్దుకుని చనిపోయిన వారి సంఖ్య కూడా ఎక్కువే. కావాలంటే మీరు ప్రతీ ఏడాది ప్రమాదాల సంఖ్యను బయటకు తీయండి. ముఖ్యంగా సైరన్స్, నెంబర్ ప్లేట్లు అయితే ఇష్టానుసారంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ముఖ్యంగా కార్లపై సైరెన్లు అయితే ఎవరి మిగతా 2లో..

# 'అన్నంలో విషం కలిపి చంపేయండి'

- సంగారెడ్డిలో ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ అమానుషంగా ప్రవర్తించాడు
- విద్యార్థులు తనపై ఫిర్యాదు చేశారనే కోపంతో విచక్షణ మరిచాడు
- తల్లీతండ్రీ అన్నీ తానై చూసుకోవాల్సిన వార్డెన్ ఒక వీధి రౌడీలా మారాడు
- హాస్టల్‌లో వసతులు సరిగా లేవని విద్యార్థులు రోడ్డెక్కడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు
- వసతి గృహం సిబ్బందికి ఫోన్ చేసి వాళ్ల అన్నంలో విషం కలిపి చంపేయండని అన్నారు
- దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి హాస్టల్ వార్డెన్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు

02

# అసెంబ్లీని కుదిపేసిన ఆటోడ్రైవర్లు

- అసెంబ్లీ సమావేశాల్లో ఆటోడ్రైవర్ల వ్యవహారం చర్చకు దారి తీసింది
- ఆటోడ్రైవర్లను అరెస్టు చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు
- ప్రభుత్వం చేతకాని తనానికి అరెస్టు చేస్తున్నారని వ్యాఖ్యానించారు
- కేసీఆర్ తెలంగాణకు మరణ శాసనం రాశారని సీఎం మండిపడ్డారు
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆటో డ్రైవర్ల పక్షాన గళం విప్పారు
- హామీని నెరవేర్చకపోవడంతో ఆటోడ్రైవర్లు చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు
- మహిళా శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించింది
- ఏటా రూ.11 వేల చొప్పన డ్రైవర్ల ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆటో డ్రైవర్ల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ విషయాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చేందుకు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో డ్రైవర్ల జేఏసీ నేతలను, వేల మంది ఆటో డ్రైవర్లను అక్రమంగా అరెస్టు చేయడంపై ఆయన మండిపడ్డారు. నిన్నటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లను, ఆటో యూనియన్ల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. వేల మంది ఆటో డ్రైవర్లను రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లలో అదుపులోకి తీసుకొని బంధించి ఉంచడం దుర్మార్గమైన చర్యగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నిస్తే నిర్బంధాలు, అరెస్టులతో గొంతు నొక్కుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మిగతా 2లో..

# పతనం బాటలో ఉద్యమం

- మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఒక కీలక మలుపు చోటుచేసుకుంది
- మావోయిస్టు పార్టీకి తెలంగాణలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది
- పీపుల్స్ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్ బర్సె దేవా డీజీపీ ఎదుట లొంగిపోయారు
- 48 మంది అనుచరులతో అధికారికంగా లొంగిపోవడం సంచలనంగా మారింది
- బర్సె దేవా మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన వ్యూహకర్తగా పేరుపొందారు

03

# అంజన్నే నన్ను కాపాడారు



( మొదటి పేజీ తరువాయి )

పవన్ కళ్యాణ్‌కి తెలంగాణ దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రధాన స్థానాచార్యులు కపీంద్ర స్వామి పవన్ కళ్యాణ్‌ని సంప్రదాయబద్ధంగా ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇరు వైపులా ఉన్న వెంకటేశ్వరస్వామి, లక్ష్మీ అమ్మవార్లకు అర్చనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందించి, స్వామి వారి తీర్థ ప్రసాదం అందచేశారు. దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఈవో టి. శ్రీకాంతరావులు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. పవన్ కళ్యాణ్‌తోపాటు టీటీడీ బోర్డు మెంబర్ బి.ఆనందసాయి, తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ సలహాదారు గోవింద్ హరే, జనసేన ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, ఆర్ కె సాగర్ తదితరులు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆంజనేయ స్వామి ఒక ప్రాంత సొత్తు కాదు. ఒకరి సొత్తు కాదని విశ్వంతర్యామి అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. అలాంటి స్వామి వారికి తాము సేవ చేసుకోవడం ఆనందంగా ఉంది అని డిప్యూటీ సీఎం చెప్పుకొచ్చారు. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కొండగట్టు అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని నిర్ణయించుకోవడం అభినందనీయం అని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కేటాయించిన రూ.35.19 కోట్ల నిధులతో కొండగట్టులో నిర్మించనున్న ధర్మశాల, దీక్ష విరమణ మండపం కోసం భూమి పూజ నిర్వహించారు. 96 గదులతో ధర్మశాలను నిర్మించనున్నట్లు తెలుస్తోంది.

ఈ సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడారు. 'అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మను ఇచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో తలుచుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యం వేస్తుంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు' అని అన్నారు. టీటీడీ, తెలంగాణ నేతల సమిష్టి కృషితోనే ధర్మశాల నిర్మాణం విషయంలో ముందడుగు పడిందని అన్నారు. భక్తుల బలమైన సంకల్పంతో ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ పర్యటన సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బృందావనం రిసార్ట్‌లో సర్పంచ్‌లు, జనసేన కార్యకర్తలతో కూడా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజేతలను పేరుపేరునా అభినందిస్తూ, తెలంగాణ రాజకీయాల్లో ఇదొక సరికొత్త మార్పుకు నాంది కావాలని ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. తాను పార్టీ పెట్టడానికి నాలో చైతన్యం నింపింది, నాకు ధైర్యం ఇచ్చింది తెలంగాణ నేలే అని భావోద్వేగంగా పేర్కొన్నారు. రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ బిడ్డలు చేసిన పోరాటం, అమరవీరుల త్యాగాల నుంచి తాను రాజకీయ శక్తిని పొందానని చెప్పారు. రాజకీయాల్లో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని నిలబడటానికి ఇక్కడి పోరాట స్ఫూర్తే కారణమని, తెలంగాణలో పుట్టిన జనసేన పార్టీ ఇక్కడి ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

తెలంగాణకు ప్రస్తుతం బలమైన, నిజాయితీ కలిగిన యువ నాయకత్వం అవసరమని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల ప్రతినిధులుగా మీరు వేసిన ఈ చిన్న అడుగు, భవిష్యత్తులో మహా ప్రస్థానానికి దారి తీస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సిద్ధాంత బలం ఉన్న నాయకులను ఎవరూ ఏమీ చేయలేరని, పదవుల కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే తపనతో ఎదగాలని పిలుపునిచ్చారు. పోటీ చేసిన స్థానాల్లో 50 శాతం విజయం సాధించడం సామాన్యమైన విషయం కాదని, ఇది పార్టీ శ్రేణుల కష్టానికి నిదర్శనమని కొనియాడారు.

# శారదా నగర్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ ప్రారంభోత్సవం



**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదా నగర్ కాలనీలో సుమారు రూ.1 కోటి వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న శారదా నగర్ కమ్యూనిటీ హాల్ భవనం మొదటి అంతస్తు నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎల్.బి. నగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి , హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు స్థానిక ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. శారదా నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని చేపట్టినందుకు కాలనీవాసులు ఎమ్మెల్యేకు,కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కమ్యూనిటీ హాల్ ద్వారా కాలనీలో వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునే సౌకర్యం కలుగుతుందని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి లు మాట్లాడుతూ.. శారదా నగర్ కాలనీవాసుల చిరకాల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని సుమారు రూ.1 కోటి వ్యయంతో ఈ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. భవనం పూర్తయిన అనంతరం ప్రజలకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా రూపకల్పన చేస్తున్నామని అన్నారు. అలాగే రానున్న రోజుల్లో హయత్‌నగర్ డివిజన్ మూడు డివిజన్లుగా విభజించబడినప్పటికీ, హయత్‌నగర్, హైకోర్ట్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ డివిజన్ల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా అవసరాలకు అనుగుణంగా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. హయత్‌నగర్ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, కేంద్ర సెన్సార్ బోర్డ్ సభ్యులు అప్పారావు, నాయకులు ఎర్ర శ్రీకాంత్, మధుసూదన్, సంఘశెట్టి లక్ష్మణ్, వెంకటనారాయణ, తిరుమలేష్, అలాగే అధ్యక్షులు సామ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.ఎల్.ఎన్. రావు, ఉపాధ్యక్షులు సుధాకర్, సుబ్బారెడ్డి, కోశాధికారి రాజశేఖర్, ఇందిర, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పొన్నంకు శాసనమండలి చైర్మన్ క్లాస్

( మొదటి పేజీ తరువాయి )

ఇష్టమొచ్చినట్లు వాళ్లు పెడుతున్నారు. వాహనాల నెంబర్ ప్లేట్లపై ఎమ్మెల్యే, పోలీసు అని రాసుకున్నా ఎవరూ పట్టించుకున్న పరిస్థితులు లేవు. మీ శాఖలో వెహికల్ ఇన్స్పెక్టర్లు తనిఖీలు చేస్తున్నారా, చేస్తే ఎందుకు పట్టించుకోవడంలేదు. దయచేసి ఇలాంటి విషయాలను ఖచ్చితంగా పట్టించుకోవాలని కోరారు. పోలీస్ , ఆర్ అండ్ బీ, ట్రాన్స్ పోర్ట్ సమన్వయంతో పని చేస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. అలాగే మల్కాపూర్ ఫిట్నెస్ సంటర్ ను మీరు నేను కలసి విజిట్ చేశాము. అది ప్లాన్ లో రాలేదు. వర్కవుట్ అవ్వట్లేదు. కేంద్రం 7కోట్లు ఇచ్చి తయారు చేసింద, నిరుపయోగంగా ఉంది. మరో ఎనిమిది కోట్లు పెడితే అది అప్డేట్ కాదు. ఆ ఎనిమిది కోట్లు పెద్ద సమస్యకాదు. మీరు సీరియస్‌గా తీసుకుంటే ఆ ఫిట్ నెస్ సెంటర్ ను అందుబాటులోకి తేవచ్చు. వేగం కన్నా.. ప్రాణం మిన్న.. ఇలా అనేక రకాల స్లోగన్స్ ఉన్నాయి. ప్రమాదాల నియంత్రణకు మీరు ఈ స్లోగన్స్ ఎందుకు ప్రచారం చేయడంలేదు. లారీల వెనక , బోర్డులు మెయిన్ రోడ్లపై ఈ స్లోగన్స్ పెట్టొచ్చు. ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించొచ్చు. కానీ అలా ఎందుకు చేయడంలేదు. అది మీరు చేస్తారా, ఆర్ అండ్ బీ చేస్తారా, లేక పోలీసులు చేస్తారా అనేది మీరు వెంటనే ఓ నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఇక నుంచి రాష్ట్రంలో కొత్తగా రిజిస్టర్ అయ్యే వాహనాలకు రోడ్ సేఫ్టీ సెస్ విధించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం అసెంబ్లీలో తెలంగాణ మోటార్ వెహికిల్స్ టాక్సేషన్ బిల్లు 2025ని ప్రవేశపెట్టి మాట్లాడారు. ద్విచక్ర వాహనాలకు రూ.2వేలు, లైట్ మోటార్ వాహనాలకు రూ.5 వేలు, పెద్ద వాహనాలకు రూ.10 వేలు రోడ్ సేఫ్టీ సెస్ విధించనున్నట్లు చెప్పారు. 4 వీలర్ తేలికపాటి గూడ్స్ వాహనాలకు త్రైమాసిక టాక్స్ ఉండేదని.. రవాణా శాఖ నిపుణులతో చర్చించి గూడ్స్‌కు సంబంధించిన వాహనాలపై లైఫ్ టాక్స్ విధిస్తూ 7.5 శాతానికి చేయడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రోడ్ సేఫ్టీపై సెస్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే.. జనవరి 1 నుండి 31 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని.. అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తాము రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో అఫిడవిట్ తీసుకురావాలని.. ఇందులో విద్యా, సంక్షేమ శాఖ పాఠశాలలు పాల్గొనేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రతి పౌరునికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. యూనిసెఫ్ సహకారంతో స్కూళ్లలో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వెయ్యి మంది రవాణా శాఖ అధికారులు ఉంటే.. కోటి 80 లక్షల వాహనాలు ఉన్నాయని వెల్లడించారు. ఎవరికి వారు స్వయంగా వాహనాల ఫిట్నెస్ చూసుకోవాలని.. రోడ్డు నిబంధనలు పాటించాలని అన్నారు. బ్లాక్ స్పాట్‌లను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని.. అతి వేగానికి స్పీడ్ కట్టడికి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈవీ పాలసీ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలు పెరిగి కాలుష్యాన్ని అరికడుతున్నామన్నారు. త్వరలో ఢిల్లీ మాదిరి ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్స్ ఇక్కడ ఏర్పాటు చేస్తామని తెలిపారు.





# అసెంబ్లీని కుదిపేసిన 'ఆటోడ్రైవర్లు'

( మొదటి పేజీ తరువాయి )

రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన ఆటో యూనియన్ల నేతలను, ఆటో అన్నలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటనను, ఆటో అన్నలు కోరినట్లుగానే ఈరోజే అసెంబ్లీలో ప్రభుత్వం చేయాలని ఆయన కోరారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు కొనసాగకుండా ఉండాలంటే, వారికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాల్సిందేనని కేటీఆర్ స్పష్టంచేశారు. కేటీఆర్‌తోపాటు.. పలువురు బీఆర్ ఎస్ నాయకులు కూడా ఆటోడ్రైవర్ల సమస్యలపై స్పందించారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. మహిళా శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించింది. దీంతో తమ ఉపాధికి గండిపడుతుందని ఆటో డ్రైవర్లు. నిరసన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుకున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం ఏటా రూ.11 వేల చొప్పున ఆటో డ్రైవర్ల ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చింది. అయితే.. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా.. ఇప్పటి వరకు ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టలేదు. తొలుత అనేక నిబంధనలు అయితే విడుదల చేశారు. ఆటో డ్రైవర్ల సంఖ్యను కూడా తేలుస్తామన్నారు. కానీ, ఇది ముందుకు సాగలేదు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో ఆటోడ్రైవర్లు.. శనివారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. ప్రస్తుతం శీతాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అసెంబ్లీని ముట్టడించి అయినా.. తమ డిమాండ్లు నెరవేర్చుకోవాలని భావిస్తూ.. అసెంబ్లీని ముట్టడించేందుకు ఆటో యూనియన్ కార్మికులు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు అరెస్టు అయ్యారు. ఎక్కడికక్కడ ఆటోడ్రైవర్లను అరెస్టు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లోనూ.. ఆటో డ్రైవర్లు ధర్నాలు, నిరసనలు తెలుపుతున్నారు. అయితే.. అక్కడ కూడా పరిస్థితి ఇలానే ఉంది. మరోవైపు హైదరాబాద్‌లో ఆటోలను బంద్ చేశారు. ఈ వ్యవహారం అసెంబ్లీని కుదిపి వేసింది.



తెలంగాణ శాసనమండలిలో చర్చ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆటో డ్రైవర్ల పక్షాన గళం విప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు పథకం వల్ల మహిళా ప్రయాణికులందరూ ఆర్టీసీ వైపు మళ్లారని, దీనివల్ల లక్షలాది మంది ఆటో డ్రైవర్ల ఉపాధి తీవ్రంగా దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులను ఆదుకునేందుకు వినూత్నమైన ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచారు. ఆర్టీసీ బస్సులు కేవలం ప్రధాన రహదారులకే పరిమితం అవుతాయని.. కానీ ఆటోలు రాష్ట్రంలోని ప్రతి గల్లీకి వెళ్తాయని మల్లన్న గుర్తు చేశారు. 'మహాలక్ష్ములను (మహిళలను) వారి ఇంటి గడప నుంచే గమ్యస్థానాలకు చేర్చే అవకాశం ఆటోలకే ఉంది. కాబట్టి, బస్సుల్లో మాదిరిగానే ఆటోల్లో కూడా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. దీనికి అయ్యే ఛార్జీలను ప్రభుత్వం నేరుగా ఆటో డ్రైవర్ల ఖాతాల్లో జమ చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు. దీనివల్ల మహిళలకు ప్రయాణం మరింత సులభతరం కావడమే కాకుండా.. ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ సంస్థలు ఆటో డ్రైవర్ల నుంచి భారీగా కమీషన్లు వసూలు చేస్తూ వారి శ్రమను దోచుకుంటున్నాయని మల్లన్న విమర్శించారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే స్వయంగా ఒక మొబైల్ యాప్‌ను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహించే యాప్ వల్ల డ్రైవర్లకు కమీషన్ల భారం తగ్గుతుందని ప్రయాణికులకు సురక్షితమైన సేవలు అందుతాయని వివరించారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా ఆయన సభ దృష్టికి తెచ్చారు.

# సీఎం సహాయక నిధి చెక్కు అందజేత



**మునుగోడు, విశాలభారతి:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సౌజన్యంతో మంజూరైన ఒక లక్ష యాభై వేలు రూపాయల ఎల్ఓసి పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ జాజుల స్వామి గౌడ్ మాట్లాడుతూ జమస్థాన్ పల్లి గ్రామానికి చెందిన జినుకల రామకృష్ణ అనే వ్యక్తి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని అతనికి మెరుగైన చికిత్స అవసరం ఉన్నదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎల్ఓసిని మంజూరు చేయించారన్నారు. త్వరిత గతిన ఎల్ఓసిని మంజూరు చేయించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అందుగుల నర్సమ్మ యాదయ్య, మాజీ సర్పంచ్ పంతంగి పద్మ స్వామి గౌడ్, మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండి అన్వర్, జినుకల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన బేగరి రాజు

**మొయినాబాద్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ జె రామారావు, రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఏడి జొన్నల పద్మావతిలకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలులతో సన్మానం చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ అలమనేటి గోపాల్, కొత్తపల్లి విక్రమ్ రెడ్డి, కమ్మరి యాదగిరి ఛారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# 'అన్నంలో విషం కలిపి చంపేయండి'

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం వార్డెన్ కిషన్ నాయక్ అమానుషంగా ప్రవర్తించాడు. అసభ్య పదజాలంతో తమను వేధిస్తున్నాడంటూ విద్యార్థులు తనపై ఫిర్యాదు చేశారనే కోపంతో విచక్షణ మరిచాడు. గురుకుల పాఠశాలలో విద్యార్థులను తల్లీతండ్రీ అన్నీ తానై చూసుకోవాల్సిన హాస్టల్ వార్డెన్ ఒక వీధి రౌడీలా ప్రవర్తించారు. హాస్టల్‌లో వసతులు సరిగా లేవని విద్యార్థులు రోడ్డెక్కడంతో అతను ఆగ్రహం వ్యక్తం చేశాడు. వంటమనిషికి ఫోన్‌చేసి విద్యార్థులను దూషించాడు. అంతేగాక 'అందరికీ విషంపెట్టి చంపెయ్ పీడ పోతది' అని వ్యాఖ్యానించాడు. ఆ మాటలకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. సంగారెడ్డి జిల్లాలోని సిర్గాపూర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే రియాక్ట్ అయ్యారు. హాస్టల్ వార్డెన్ కిషన్ నాయక్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. కాగా గడిచిన 10 రోజులుగా హాస్టల్‌లో కరెంట్ లేదని, వార్డెన్‌ను అడిగితే తాగివచ్చి బూతులు తిడుతున్నాడని విద్యార్థులు ఇటీవల రోడ్డుపై బైఠాయించారు. దాంతో తనపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ కోపంతో పిల్లలను బూతులు తిట్టాడు. వసతి గృహం సిబ్బందికి ఫోన్ చేసి... 'నా మీదనే ఫిర్యాదు చేస్తారా ? వాళ్ల అన్నంలో విషం కలిపి చంపేయండి'' అంటూ హుకుం జారీ చేశాడు. ఇందుకు సంబంధించిన ఆడియో శుక్రవారం వైరల్‌వ్వగా.. ఈ ఘటనపై స్పందించిన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.. సదరు వార్డెన్ కిషన్ నాయక్‌ను సస్పెండ్ చేశారు. అసలేం జరిగిందంటే.. వార్డెన్ కిషన్ నాయక్ తీరుతో విసిగిపోయిన వసతి గృహంలోని విద్యార్థులు గురువారం రాత్రి రోడ్డెక్కారు. కద్పుల్‌సిర్గాపూర్ రహదారిపై బైఠాయించి వార్డెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న స్థానిక ఎస్సై మహేష్, సర్పంచ్ శ్రీనివాస్‌రావు విద్యార్థులకు నచ్చజెప్పారు. వసతి గృహానికి వచ్చిన ఏఎస్‌డబ్ల్యూవో చందా శ్రీనివాస్‌కు వార్డెన్ తీరుపై ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న కిషన్‌నాయక్ శుక్రవారం ఉదయం మద్యం మత్తులో వసతి గృహానికి వచ్చి పిల్లలను బూతులు తిడుతూ రెచ్చిపోయాడు. వసతి గృహం సిబ్బందికి ఫోన్ చేసి అన్నంలో విషం కలిపి విద్యార్థులను చంపేయమని హుకుం జారీ చేశాడు. ఈ ఫోన్ సంభాషణ బయటికి రాగా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. హాస్టళ్లలో ఉంటున్న పిల్లలు శతాబ్దాలుగా విద్యాగంధానికి నోచుకోని బడుగు, బలహీనవర్గాలకు చెందినవారు. ఊరికి మాత్రమే కాదు, విద్యకు కూడా వెలిగా బతుకులు వెళ్లదీసిన ఆ వర్గాలవారికి ప్రామాణిక విద్యనందించటంతోపాటు మెరుగైన ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించటం ప్రభుత్వాల బాధ్యత కావాలి. పిల్లల మరణానికి దారితీస్తున్న అనారోగ్య సమస్యలు మరీ పెద్దవేమీ కాదు. జ్వరం, కడుపు నొప్పి, వివిధ సాంక్రమిక వ్యాధులు. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే, పౌష్టికాహారం అందించ గలిగితే, నిర్ణీత వ్యవధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటే... ఈ వ్యాధులు దరిచేరే అవకాశం ఉండదు. ఆ మాత్రం చేయటం కూడా చేతగాని ప్రభుత్వం రేపటి పౌరుల ఉసురు తీస్తోంది. వెలుగూ వికాసమూ లేక చీకట్లో మగ్గిన తమ మాదిరిగా పిల్లలుండొద్దని, వారు మెరుగైన జీవితం గడపాలన్న ఆరాటంతో తల్లిదండ్రులు తమ కంటిపాపలను దూరమైనా పంపుతున్నారు. అలాంటివారిని ఎంత సున్నితంగా చూసుకోవాలో, ఎంత సురక్షితమైన సదుపాయాలు కల్పించాలో తెలియని చర్మం మందం సర్కారిది. మెరుగైన విద్యతోపాటు బడుల్లో, హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు నెలకొల్పాలి. రుచికరమైన అల్పాహారం, భోజనం అందించాలి. పరిశుభ్రమైన మరుగు దొడ్లు, స్నానపు గదులు నిర్మించాలి. జిల్లాల్లో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ప్రతి 15 రోజులకూ హాస్టళ్లు సందర్శించి రాత్రి బస చేయాలి. ఇప్పుడు అధికారుల సందర్శన మాట అటుంచి, అడిగే దిక్కూ మొక్కూ లేక హాస్టళ్లు బావురుమంటున్నాయి.



# ఒక్క నీటి చుక్కనూ వదలం

( మొదటి పేజీ తరువాయి )

పనులు పూర్తయ్యాయని గొప్పలు చెప్పుకుందని, కానీ వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించేందుకే తాను ఈ ప్రజెంటేషన్ ఇస్తున్నానని మంత్రి స్పష్టం చేశారు. శ్రీశైలం నుంచి ఏపీ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలిస్తుంటే గత బీఆర్ఎస్ సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని విమర్శించారు మంత్రి. ఏపీ రోజుకు 13 టీఎంసీలు తరలించేలా ప్రాజెక్టులు విస్తరించినా, రాయలసీమ ఎత్తిపోతల చేపట్టినా కేసీఆర్ అడ్డుకోలేదని, తాము అధికారంలోకి వచ్చాక కేంద్రానికి ఫిర్యాదు చేసి ఆ పనులను ఆపించామని మంత్రి తెలిపారు. కృష్ణా జలాల్లో కేవలం 299 టీఎంసీలకే అంగీకరించి కేసీఆర్ తెలంగాణకు తీరని అన్యాయం చేశారని, తాము ఇప్పుడు 550 టీఎంసీల కోసం డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించి ఇంకా 39 వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని మంత్రి ఉత్తమ్ వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఏకంగా రూ. 90 వేల కోట్లు ఖర్చు చేసిన గత పాలకులు, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు మాత్రం కేవలం రూ. 27 వేల కోట్లు మాత్రమే వెచ్చించి తీవ్ర వివక్ష చూపారని ఉత్తమ్ కుమార్ రెడ్డి గత బీఆర్ఎస్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరులో కేవలం ఒక మోటార్‌ను ఆన్ చేసి జాతికి అంకితం చేశారని, ఆ మరుసటి రోజే దాన్ని మళ్లీ ఆఫ్ చేశారని ఎద్దేవా చేశారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, రూ. 40 వేల కోట్ల బిల్లులను పెండింగ్ లో పెట్టి తమ ప్రభుత్వంపై భారం మోపారని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరంపై ఉన్న మోజుతో పాలమూరును గాలి కొదిలేశారని, అక్కడ సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోయి.. ఇక్కడ మాత్రం 1.5 టీఎంసీల నుంచి 1 టీఎంసీకి తగ్గించారని ఉత్తమ్ విమర్శించారు. వాస్తవానికి జూరాల నుంచి నీటిని తీసుకుంటే 60 రోజుల్లో 121 టీఎంసీలు వచ్చేవని, కానీ శ్రీశైలానికి మార్చడం వల్ల అది 68 టీఎంసీలకు పడిపోయిందని సభకు వివరించారు. ఆయకట్టు, భూసేకరణ లేకుండానే డీపీఆర్ రూపొందించారని తప్పుబట్టారు. జూరాల వద్ద అయితే 22 పంపులతో 414 మీటర్ల లిఫ్ట్ సరిపోయేదని, కానీ శ్రీశైలానికి మార్చడం వల్లే పంపుల సంఖ్య 37కి పెరిగి, 560 మీటర్ల లోతు నుంచి నీటిని ఎత్తిపోయాల్సి వస్తోందని మంత్రి గణాంకాలతో సహా వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే జీవో ఇచ్చిందని మంత్రి ఉత్తమ్ గుర్తు చేశారు. 2013 ఆగస్టులో అప్పటి ప్రభుత్వం జీవో ఇచ్చిందని, దాని ప్రకారం జూరాల ఆధారంగానే ముందుకెళ్తే పాలమూరు ప్రాజెక్టు పాత ప్రాజెక్టుగానే ఉండేదని, నీటి కేటాయింపులు వచ్చి ఉండేవని చెప్పారు. జూరాల నుంచి ప్రాజెక్టును చేపట్టి ఉంటే 70 టీఎంసీలను తీసుకునేందుకు వీలుండేదన్నారు. కృష్ణా బేసిన్‌లోని మెయిన్ స్ట్రీమ్‌లో జూరాల ఫస్ట్ ప్రాజెక్ట్ అని, అప్పర్ కృష్ణా సబ్ బేసిన్, అప్పర్ భీమా సబ్ బేసిన్‌లో ఉండడం వల్ల.. పశ్చిమ కనుమల నుంచి కూడా వరద వస్తుందని చెప్పారు. శ్రీశైలానికి మార్చడం వల్ల అప్‌స్ట్రీమ్‌లో ఉన్న ప్రాజెక్టుల నుంచి వచ్చే వరదపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల ప్రాజెక్ట్ నిర్మాణ ఖర్చు కూడా భారీగా పెరిగిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. కాళేశ్వరంలో అదనపు రెండు టీఎంసీల కోసం.. నాటి బీఆర్ఎస్ పాలకులు రూ.20 వేల కోట్లకు టెండర్లు పిలిచారన్నారు. అదే సమయంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కెపాసిటీని కేవలం ఒక టీఎంసీకి ఉద్దేశపూర్వకంగా తగ్గించారన్నారు. తద్వారా ఏపీ నిర్మించతలపెట్టిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు బాటలు వేశారన్నారు.



VISHALABHARATITELUGU DAILY
విశాల భారతి

# పార్టీ మార్పు పేరుతో తప్పుడు ఆరోపణలు





పార్టీ మారినందుకు ఇంటిపై దౌర్జన్యం

- భార్యభర్తలపై దాడి.. రూ.50 వేల అపహరణ ఆరోపణ
- కురవి పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

కురవి, విశాలభారతి: మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం ఉమ్మడి తట్టుపల్లి గ్రామంలో రాజకీయ ఆరాచకం తారాస్థాయికి చేరుతోంది. గతంలో రాజకీయ ఘర్షణలతో హత్యకు దారితీసిన ఈ గ్రామంలో, కొన్నేళ్లుగా ప్రశాంత వాతావరణం నెలకొన్నప్పటికీ, ఇటీవల స్థానిక ఎన్నికల అనంతరం మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గ్రామంలో కొంతమంది రాజకీయ నాయకులు, అనుచరులు బహిరంగంగా తల్వార్‌లు (కత్తులు) పట్టుకొని పుట్టినరోజుల వేడుకల పేరిట ఫోజులు ఇవ్వడం, పార్టీల ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం వంటి చర్యలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలతో గ్రామంలో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి ఆరాచకాలకు పాల్పడుతున్న వారిపై నిఘా వేసి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు.

పార్టీ మారినందుకే దాడి చేసినట్లు ఆరోపణ

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆరెస్ పార్టీలోకి మారిన కారణంగా తమ ఇంటిపై దౌర్జన్యం జరిగిందని, భార్యభర్తలపై దాడి చేసి రూ.50 వేల నగదును అపహరించారని చంద్యాతండా (తట్టుపల్లి) గ్రామానికి చెందిన బోడ రజిత-బహుసింగ్ దంపతులు ఆరోపించారు. ఈ మేరకు కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు బోడ రజిత శుక్రవారం తెలిపారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, డిసెంబర్ 31న గ్రామ సర్పంచ్ బోడ జామ తన భార్య సమ్మక్కతో పాటు అనుచరులతో కలిసి తమ ఇంటి వద్దకు వచ్చి, భర్త బహుసింగ్ ఇంట్లో లేని సమయంలో ఇంటి స్లాబ్‌పైకి ఎక్కి రాళ్లతో దాడి చేశారని, మహిళ అని చూడకుండా అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపించారు. మరుసటి రోజు జనవరి 1న సర్పంచ్ తన అనుచరులతో మళ్లీ ముకుమ్మడిగా ఇంట్లోకి చొరబడి రూ.50 వేల నగదును అపహరించడంతో పాటు దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ సమయంలో ఇంటికి వచ్చిన భర్త బోడ బహుసింగ్ దౌర్జన్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించగా, అతనిపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. పోలీసులను ఆశ్రయించిన బాధితులు ఈ ఘటనలపై కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితురాలు బోడ రజిత-బహుసింగ్ దంపతులు పోలీసులను కోరారు.

విశాల భారతి Main Edition Page 6 03 Jan 2026
For Advertisement Call +91 99121 62531

- దాడి చేసిన వారే బాధితులమంటూ ప్రచారం
- తప్పుడు కథనంపై గ్రామ సర్పంచ్, పెద్దల ప్రతిస్పందన
- సమగ్ర విచారణకు డిమాండ్

**కురవి, విశాలభారతి:**

కురవి మండలం చంద్యతండా (తట్టుపల్లి) గ్రామానికి సంబంధించి "పార్టీ మారినందుకు ఇంటిపై దౌర్జన్యం" అనే శీర్షికతో ప్రచురితమైన కథనం వాస్తవ విరుద్ధమని గ్రామ సర్పంచ్ బోడ జామతో పాటు గ్రామ పెద్దలు శనివారం స్పష్టం చేశారు. ఈ కథనంపై ప్రతిస్పందించిన వారు తెలిపిన వివరాల ప్రకారం... డిసెంబర్ 31 సాయంత్రం బోడ రజిత, బోడ బహుసింగ్, వారి బంధువులు మద్యం సేవించి గ్రామ కూడళ్లలో మహిళలు, గ్రామస్థులు అని చూడకుండా దుర్భాషలాడుతూ గొడవకు దిగారని తెలిపారు. అనంతరం ఇంటి స్లాబ్‌పైకి ఎక్కి, గ్రామ సర్పంచ్ ప్రజాప్రతినిధి గౌరవాన్ని అవమానపరుస్తూ బూతులు తిట్టడమే కాకుండా రాళ్లతో ఇంటిపై దాడి చేశారని వెల్లడించారు. ఈ ఘటనను ప్రశ్నించిన భూక్య సావిత్రి, లకుపతిపై కూడా రాళ్లతో దాడి చేసి గాయపరిచారని చెప్పారు. గాయపడిన వారు స్పృహతప్పి పడిపోవడంతో 108 అంబులెన్స్ సహాయంతో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు. దాడికి పాల్పడ్డ బోడ రజిత, బోడ బహుసింగ్, వారి బంధువులపై కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ బోడ జామ, గ్రామ పెద్దలు వెల్లడించారు. తామే దాడికి పాల్పడి, తరువాత పలు పత్రికల్లో పార్టీ మార్పు పేరుతో ఇంటిపై దౌర్జన్యం చేశారంటూ తప్పుడు ఆరోపణలు చేస్తూ గ్రామంలో ఉద్రిక్తతలకు దారితీయడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి నిజాలు వెలికి తీయాలని, దోషులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ బోడ జామతో పాటు గ్రామ పెద్దలు కోరారు.

# చావైనా బతుకైనా తెలంగాణ కోసమే..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



హరీష్ రావు సీఎం రేవంత్‌కు కౌంటర్‌లు వేయగా స్పీకర్ సబ్జెక్ట్ గురించి మాట్లాడాలని చెప్పారు. అయితేనే మైక్ ఇస్తామని చెప్పారు. దీంతో స్పీకర్ అధికారపార్టీవైపు మాట్లాడుతున్నారని, ఈ సెషన్‌ను తాము బైకాట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పై నేతల మధ్య తెలంగాణ అసెంబ్లీలోవాడి వేడి రచ్చ నడుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ పై మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు మరణ శాసనం ' రాసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో సుదీర్ఘంగా మాట్లాడారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి రాష్ట్రానికి దక్కిన 811 టీఎంసీలలో తెలంగాణకు 490 టీఎంసీల వాటా అడగాల్సింది పోయి, కేసీఆర్ కేవలం 299 టీఎంసీలకే అంగీకరించి సంతకం పెట్టారని మండిపడ్డారు. ఇదే తప్పుడు నిర్ణయం వల్ల పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలంకు మార్చి, అంచనాలను రూ. 32,800 కోట్ల నుంచి ఏకంగా రూ. 90 వేల కోట్లకు పెంచారని, ఇది కేవలం కమీషన్ల కోసమేనని ఆరోపించారు.

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పునాదులు 2009లో ఎంపీ విఠల్ రావు రాసిన లేఖతో పడ్డాయని గుర్తు చేసిన సీఎం, 20052014 మధ్యే కాంగ్రెస్ ప్రభుత్వం నెట్టెంపాడు, కల్వకుర్తి వంటి కీలక ప్రాజెక్టులను మంజూరు చేసిందని వివరించారు. అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాల్సింది పోయి, రీడిజైనింగ్ పేరుతో కాలయాపన చేసిందని విమర్శించారు. వలసల జిల్లా బిడ్డగా కరువు బాధలు తెలిసిన వాడిని కాబట్టే, ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నానని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే ప్రతిపక్ష నేత కేసీఆర్, చర్చకు భయపడి రెండేళ్లుగా సభకు రాకపోవడం చట్టసభలను అవమానించడమేనని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. "బట్టలు ఊడదీస్తాం, తోలు తీస్తాం" అని గతంలో సవాల్ విసిరిన వారు, ఇప్పుడు సభలో వాస్తవాలు బయటపడతాయనే భయంతో పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమైన ఈ సభలో రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా అబద్ధాలకు తావులేకుండా తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. చావైనా బతికైనా తెలంగాణ కోసమేనని స్పష్టం చేశారు.

వలసల జిల్లా పాలమూరు బిడ్డగా కరువు కష్టాలు, పేదరికం ఎలా ఉంటుందో నాకు పూర్తిగా తెలుసన్నారు. తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతుందని, ఇందుకు కాంగ్రెస్ కారణమని కేసీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు ఎలా ఉపయోగపడతాయో, ఈ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై తన అనుభవంతో సూచనలు ఇస్తారని అనుకున్నామన్నారు. అందుకే కృష్ణా జలాలపై ఒకరోజు, గోదావరి జలాలపై ఒకరోజు సభలో చర్చిద్దామని ఆహ్వానించారు. ఈ శాసన సభకు ఒక పవిత్రత ఉంది. ఈ సభలో జరిగే చర్చలను, విషయాలను, అందులోని వాస్తవాలను ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో నమ్ముతారన్నారు. ఇక్కడ అబద్దానికి ఆస్కారం లేదు. మాటల గారడీలకు స్థానం లేదని సీఎం రేవంత్ మాట్లాడారు. ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలే తప్ప రాజకీయ ప్రయోజనాలకు ఇది వేదిక కాబోదని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ప్రాతినిధ్యానికి ప్రతిరూపం ఈ సభ అంటూ మాట్లాడారు. ఈ సభలో మాట్లాడే ప్రతిమాట రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఉంటుందన్న నమ్మకం ప్రజల్లో ఉంటుందన్నారు.

శాసనసభకు రాకుండా గులాబీ పార్టీ నేతలు తప్పించుకుతిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బహిరంగ సభల్లో మాట్లాడటం కాదని.. సభకు రండి నిజాలు ఏంటో తేలుద్దామని సవాల్ విసిరారు. అసెంబ్లీలో కృష్ణా నది జలాలపై చర్చ పెట్టమని తాము అడగలేదని ప్రస్తావించారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ అడిగారని చెప్పుకొచ్చారు. అందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి కృష్ణా నదీ జలాలపై చర్చిస్తున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ సభకు ఎందుకు రాలేదో కారణమే లేదని అన్నారు. హరీశ్‌రావుకు మాట్లాడే అవకాశాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చారని.. అయినా తాము సభకు రామని వెళ్లిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని తమను కోరారని.. అయితే మీ బట్టలు ఊడదీస్తామని ఒకరు, తోలు తీస్తామని మరొకరు మాట్లాడారని.. ఇప్పుడేమో కుంటిసాకులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. సభకు వచ్చి చర్చలో పాల్గొంటే ఎవరి బట్టలు ఎవరు ఊడదీయాలో ప్రజలే తేల్చేవారని అన్నారు. ప్రాజెక్టులపై నిలదీస్తామన్న కేసీఆర్ సభకు ఎందుకు రాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు సీఎం రేవంత్‌రెడ్డి.

సభకు వచ్చి కేసీఆర్ దగ్గర ఉన్న సమాచారం ప్రభుత్వానికి ఇస్తారనుకున్నామని.. కానీ అసెంబ్లీకి ఎందుకు రావట్లేదో కారణం చెప్పాలని నిలదీశారు. కేసీఆర్ సూచనలు ఇస్తే తీసుకుందామని తాము అనుకున్నామని తెలిపారు. కృష్ణానీటిపై ఒకరోజు, గోదావరి నీటిపై మరో రోజు చర్చ పెట్టాలని అనుకున్నామని చెప్పారు. రెండేళ్లుగా ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సభకు వచ్చి కేసీఆర్ అనుభవాలు తమతో పంచుకోవాలని తాను పదేపదే ఆయన్ను కోరుతున్నామని అన్నారు. గతంలో మాజీ మంత్రి జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క పోషించిన పాత్ర పోషించాలని తాము కోరామని తెలిపారు. జానారెడ్డి, భట్టిలను ఆనాడు అవమానించినా భరించి సభకు వచ్చి సలహాలు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

# పతనం బాటలో ఉద్యమం

- మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఒక కీలక మలుపు చోటుచేసుకుంది
- మావోయిస్టు పార్టీకి తెలంగాణలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది
- పీపుల్స్ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్ బర్సె దేవా డీజీపీ ఎదుట లొంగిపోయారు
- 48 మంది అనుచరులతో అధికారికంగా లొంగిపోవడం సంచలనంగా మారింది
- బర్సె దేవా మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన వ్యూహకర్తగా పేరుపొందారు
- హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత,పార్టీ సాయుధ బలగాల బాధ్యతలను తీసుకున్నారు
- దేవాపై ఎన్ఐఏ రూ.75 లక్షల రివార్డు ప్రకటించినట్లు డీజీపీ పేర్కొన్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




తెలంగాణ మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఒక కీలక మలుపుగా భావించదగ్గ పరిణామం చోటుచేసుకుంది. దశాబ్దాల కాలంగా సాయుధ పోరాటమే మార్గంగా పనిచేస్తున్న మావోయిస్టు పార్టీకి తెలంగాణలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సైనిక విభాగం అయిన పీపుల్స్ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్ బర్సె దేవా, మరో 48 మంది అనుచరులతో కలిసి తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోవడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ భారీ లొంగుబాటు మావోయిస్టు పార్టీ ఉనికినే ప్రశ్నార్థకంలో పడేసింది. ఒకప్పుడు 41 మంది సభ్యులతో అత్యంత బలంగా ఉన్న మావోయిస్టు కేంద్ర కమిటీ, వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్ల కారణంగా ప్రస్తుతం కేవలం నలుగురు సభ్యులకు మాత్రమే పరిమితం కావడం ఆ పార్టీ పతన దిశకు సంకేతంగా కనిపిస్తోంది.

బర్సె దేవా మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన వ్యూహకర్తగా పేరుపొందారు. ముఖ్యంగా అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత, పార్టీ సాయుధ బలగాల బాధ్యతలను భుజాన వేసుకున్న దేవా, గెరిల్లా యుద్ధ తంత్రాలను అమలు చేయడంలోనూ, పార్టీకి అత్యాధునిక ఆయుధాలను సరఫరా చేయడంలోనూ ప్రధాన పాత్ర పోషించారు. ఆశ్చర్యకరంగా హిడ్మా, బర్సె దేవా ఇద్దరూ ఛత్తీస్‌గఢ్‌లోని ఒకే గ్రామానికి చెందిన వారు కావడం గమనార్హం. తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీసులు నిర్వహించిన పక్కా ఆపరేషన్ ఫలితంగానే ఈ లొంగుబాటు సాధ్యమైంది. శుక్రవారం రాత్రి సరిహద్దు ప్రాంతం నుండి వీరిని సురక్షితంగా తరలించిన పోలీసులు, త్వరలోనే వీరికి అందే పునరావాస ప్యాకేజీల వివరాలను వెల్లడించనున్నారు. క్షేత్రస్థాయిలో పట్టున్న దేవా వంటి నాయకుడు దూరం కావడంతో మిగిలిన నలుగురు సభ్యులపై తీవ్ర ఒత్తిడి పడనుంది. బర్సె దేవా లొంగుబాటు కేవలం ఒక వ్యక్తి నిర్ణయం కాదు, అది ఒక సిద్ధాంత పోరాటంలో వస్తున్న మార్పుకు, మావోయిస్టు ఉద్యమ మనుగడ సంక్షోభానికి నిదర్శనంగా నిలుస్తోంది.

అలాగే తెలంగాణకు చెందిన మావో నేత రాజిరెడ్డి సైతం ఉన్నారు. మావోల లొంగుబాటు అనంతరం మీడియాతో మాట్లాడిన డీజీపీ శివధర్ రెడ్డి.. కీలక విషయాలను తెలియజేశారు. మావోయిస్టులు తమ నేతను అనుసరించి రెండు గ్రూపులుగా లొంగిపోయినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. బర్సీ సుక్కా అలియాస్ దేవతో పాటు 17 మంది మావోలు జన జీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. అలాగే తెలంగాణకు చెందిన రాజిరెడ్డి అతని భార్యతో కలిపి 20 మంది పోలీసులకు సరెండర్ అయ్యారన్నారు. ఇటీవల మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా గ్రామానికే దేవా కూడా చెందినవాడని డీజీపీ తెలిపారు. దేవాపై ఎన్ఐఏ రూ.75 లక్షల రివార్డు ప్రకటించినట్లు పేర్కొన్నారు. తమ ఎదుట లొంగిపోయిన వారిలో తెలంగాణ స్టేట్ కమిటీ మెంబర్ అడ్లూరి ఈశ్వరి సైతం ఉన్నట్లు డీజీపీ స్పష్టం చేశారు. అలాగే ఆవులం సోమా, సుశీల, వేముల రాజు, నందయ్య, మంకు ఇలా పలువురు ఆయుధాలు వదిలిపెట్టారని తెలియజేశారు. అడ్లూరి ఈశ్వరి నుంచి రెండు మిషన్ గన్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను సైతం డీజీపీ శివధర్ రెడ్డి వివరించారు. 8 ఏకే 47 తుపాకులు, 48 బ్యారెల్ గ్రానైడ్ లాంచర్స్, హెలికాఫ్టర్ ను సైతం కూల్చేసే సామర్థ్యమున్న ఆయుధాలను సీజ్ చేసినట్లు చెప్పారు. మావోయిస్టులకు చెందిన పీఎల్‌జీఏ బెటాలియన్ లో గతంలో 400 మంది ఉంటే ప్రస్తుతం 600 మంది మాత్రమే మిగిలారన్నారు. దీన్ని బట్టి పీఎల్‌జీఏ ఏ స్థాయిలో బలహీనపడిందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. తెలంగాణకు చెందిన రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా ఒక్కరు మాత్రమే స్టేట్ కమిటీలో మిగిలారని చెప్పారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపుతోనే పెద్ద ఎత్తున మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. సీఎం పిలుపుతో వారంతా ఆత్మ సమర్పణ చేసుకున్నారన్నారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం రివార్డ్ సైతం అందించనున్నట్లు తెలిపారు. డివిజన్ సభ్యులకు రూ. 5 లక్షలు, ఏరియా సభ్యులకు రూ.4 లక్షలు, ఇతరులకు రూ.1 లక్ష చొప్పున రివార్డు ఇస్తామన్నారు. మొత్తం రూ.1.80 కోట్లను వారికి అందజేస్తామన్నారు. అయితే తక్షణ సాయం కింద ప్రస్తుతం రూ.లక్ష ఇస్తామని డీజీపీ స్పష్టం చేశారు. ఇప్పటివరకూ మొత్తంగా 576 మంది మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ శివధర్ రెడ్డి తెలియజేశారు. పీఎల్‌జీఏ ఇచ్చిన సమాచారం ప్రకారం.. మావోయిస్టు సభ్యుల్లో 17 మంది మాత్రమే తెలంగాణ వారు మిగిలి ఉన్నట్లు తెలిపారు. సెంట్రల్ కమిటీలో ఐదుగురు, స్టేట్ కమిటీలో నలుగురు పని చేస్తున్నట్లు చెప్పారు. వారు కూడా లొంగిపోవాలని ఈ సందర్భంగా డీజీపీ పిలుపునిచ్చారు.

# వెనుజులా అధ్యక్షుడును బంధించాం

**విశాలభారతి, ఇంటర్నేషనల్:**



వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన సతీమణి సిలియా ఫ్లోర్స్‌ను తమ కస్టడిలోకి తీసుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వారిద్దరినీ ప్రస్తుతం వెనెజువెలా వెలుపలకు తరలించినట్లు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో వెల్లడించారు. అంతేకాదు ఉదయం 11 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం) మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరోవైపు తమ అధ్యక్షుడుని, ప్రథమ మహిళను అమెరికా కస్టడీలోకి తీసుకోవడంపై వెనుజువెలా ఉపాధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్స్ స్పందించారు. ప్రస్తుతం వారిద్దరూ ఎక్కడ ఉన్నారో తమకు తెలియదన్నారు. అయితే వారిద్దరూ సజీవంగా ఉన్నారో, లేదో తెలియజేయాలని, అందుకు తగిన ఆధారాలు చూపాలని అగ్రరాజ్యం అమెరికాను డిమాండ్ చేశారు. అమెరికా వెనుజువెలా భారీ వైమానిక దాడులు చేసింది. శనివారం తెల్లవారు జామున 2 గంటలకు ఆ దేశ రాజధాని కరాకస్ పరిసర ప్రాంతాల్లోని ఏడు చోట్ల భారీ పేలుళ్లు జరిపింది. తరువాత వెనుజువెలా దేశాధ్యక్షుడిని, అతని భార్యను కస్టడీలోకి తీసుకుంది. అమెరికాకు చెందిన డెల్టా ఫోర్స్ ఈ ఆపరేషన్ చేపట్టింది. అయితే ఈ దాడులకు ముందు తమ పౌరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) వెనెజువెలా గగనతలంలో అమెరికా పౌర విమానాల రాకపోకలపై నిషేధం విధించింది. అమెరికా దళాల దాడుల వల్ల కరాకస్ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజల భయాందోళనలతో వీధుల్లోకి వస్తున్నారు. మరికొన్ని చోట్ల మదురో మద్దతుదారులు నిరసనలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, 1989 తర్వాత ఒక లాటిన్ అమెరికా దేశ వ్యవహారాల్లో యూఎస్ నేరుగా జోక్యం చేసుకోవడం ఇదే మొదటిసారి.

శనివారం కరాకస్‌లోని లా కార్లోటా ఎయిర్‌ఫీల్డ్, ఫ్యూర్టే లియునా మిలిటరీ బేస్, లా గ్వైరా నౌకాశ్రయం మొదలైన కీలక సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. అయితే ఈ దాడులను వెనెజువెలా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో లోపెజ్ ఖండించారు. ఇది 'సామ్రాజ్యవాద దాడి'గా అభివర్ణించారు. దేశ రక్షణ కోసం విదేశీ బలగాలను ఎదురించాలని పౌరులకు పిలుపునిచ్చారు. వెనెజువెలాపై అమెరికా చేసిన దాడులను రష్యా, ఇరాన్, కొలంబియా ఖండించాయి. స్పానిష్ ప్రభుత్వం ఘర్షణలను ఆపేందుకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది.

నికోలస్ మదురో అమెరికాలో 'నార్కో టెర్రరిజం' (మత్తు పదార్థాల అక్రమ రవాణా) చేస్తున్నారని ట్రంప్ ఆరోపణలు చేస్తోంది. అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో అయితే, మదురోను అమెరికాకు తరలించి, అక్కడ క్రిమినల్ విచారణ చేయిస్తామని ప్రకటించారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడైన తరువాత అంతర్జాతీయ వ్యవహారాల్లో చాలా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచ దేశాలను టారిఫ్‌ల పేరుతో బెదిరించారు. వీటికి లొంగని భారత్, చైనా లాంటి దేశాలపై టారిఫ్‌లు భారీగా పెంచుతూ ఇబ్బంది పెడుతున్నారు. మరోవైపు తమకు అవసరమైన ప్రాంతాలను క్రమంగా ఆక్రమించుకునే లేదా నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ భద్రతా అవసరాలు అని పేర్కొంటూ గ్రీన్‌ల్యాండ్‌ను విలీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక యూఎస్కెనడా మధ్య ఓ కృత్రిమ రేఖను గీసి, ఆయా ప్రాంతాలను ఆక్రమించాలని చూస్తున్నారు. పనామా కాలువను కూడా స్వాధీనం చేసుకోవాలని చూశారు. కొంతకాలం క్రితం పనామాపై దాడిచేసి మిలటరీ నేత మాన్యుయెల్ నోరిగాను పదవీచ్యుతుడిని చేశారు. తాజాగా వెనుజువెలాపై భీకరదాడులకు పాల్పడ్డారు. దీనితో పక్కదేశమైన కొలంబియా అప్రమత్తమైంది. తమ సరిహద్దుల్లో బలగాలను మోహరించింది.

నెజువెలా అధ్యక్షుడు, అతని భార్యను అమెరికా దాడి చేసి బందీగా తీసుకెళ్లడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని రష్యా శనివారం ప్రకటించింది. ఇదే నిజమైతే, స్వతంత్ర దేశమైన వెనెజువెలా సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఇది అంతర్జాతీయ ప్రాథమిక సూత్రాల ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేసింది. ఓ దేశాధ్యక్షుడిని బలవంతంగా తీసుకెళ్లడం పట్ల తాము చాలా ఆందోళన చెందుతున్నామని పేర్కొంది. అమెరికా శనివారం వెనెజువెలాపై చేసిన దాడిని 'సాయుధ దురాక్రమణ'గా రష్యా వ్యాఖ్యానించింది. తమ చర్యలను సమర్థించుకోవడానికి అమెరికా చెబుతున్న సాకులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది.

మరోవైపు ఉక్రెయిన్, నేరుగా అమెరికాకు మద్దతు పలికింగి, మదురో అన్ని చట్టాలను ఉల్లంఘించారని ఆరోపించింది. "నియంతృత్వం, అణచివేత, మానవ హక్కుల ఉల్లంఘనలు లేని స్వేచ్ఛగా జీవించే దేశాల హక్కును ఉక్రెయిన్ సమర్థిస్తుంది. కానీ మదురో పాలన అన్ని విధాలుగా అటువంటి సూత్రాలన్నింటినీ ఉల్లంఘించింది. మదురో ఎన్నికల రిగ్గింగ్, నిరసనకారులపై హింస చేశారు. అందుకే మదురో ప్రభుత్వ చట్టబద్ధతను మేము గుర్తించలేదు. వెనెజువెలా ప్రజలకు సాధారణ జీవితం, భద్రత, శ్రేయస్సు, గౌరవం పొందే అవకాశం ఉండాలి" అని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహా పేర్కొన్నారు.

# మహిళా ఉపాధ్యాయురాలికి సన్మానం

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు, జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్మెట్, హయత్ నగర్ మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మహిళా ఉపాధ్యాయురాలిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్దుల్లాపూర్మెట్ ఎంపీడీవో శ్రీవాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీవాణి మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ముఖ్యంగా ప్రతి మహిళ చదువుకునేలా సమాజం ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో దేశ ప్రగతికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ ఎంఈఓ శ్రీనివాస్, అబ్దుల్లాపూర్మెట్ ఎంఈఓ జగదీశ్వర్, విద్యాభిమానులు నక్క శ్రీనివాస్ యాదవ్, జయరాామ్, ఇందిరా (కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు), అలాగే వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు దీన్ దయాళ్ రెడ్డి, సురేశ్, భాస్కర్, మహిపాల్, శ్రీహరి అదేవిధంగా రెండు మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది రాజిని, గీత, మహేష్, శ్రీలత, స్వాతి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు

- కాలం చెల్లిన బస్సులను గుర్తించి5 వెంటనే సీజ్ చేయాలి
- అధికారులు తనిఖీలు నిర్వహించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్
- జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షులు ముత్తవరపు జానకిరామ్

**కొత్తగూడెం, విశాలభారతి:**

కాలం చెల్లిన బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కొత్తగూడెం జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో కేఎల్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల బస్సు బోల్తా పడి పలువురు విద్యార్థులకు గాయాలు ఐన సంఘటన పై జిల్లా మానవహక్కుల సంఘము అధ్యక్షులు ముత్తవరపు జానకిరామ్ స్పందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ టి ఓ అధికారులు తక్షణమే స్పందించి ప్రేవేట్ విద్యాసంస్థలలో తనిఖీలు నిర్వహించాలని కోరారు.కాలం చెల్లిన బస్సులను అధికారులు గుర్తించి ఆ యాజన్యాలపై చర్యలు తీసుకొని తక్షణమే బస్సులను సీజ్ చేయాలని అన్నారు. ఒక బస్సులో కేటాయించిన సీట్ల కు మించి విద్యార్థులను ఎక్కించుకోవడం జరుగుతుంది.బస్సులో అధికంగా నిలబెట్టి తరలిస్తున్న పరిస్థితులు నెలకొని ఉన్నాయని పిల్లల తలితండ్రుల నుండి రవాణా బిల్లులను సైతం వసూలు చేసుకుంటూ బస్సులో సీటు కల్పించని పరిస్థితులు స్కూల్, కాలేజి, బస్సులలో ఉన్నాయని అనిఆరోపించారు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావుడిగా సంబంధిత ప్రాంతానికి చేరుకొని తూతూ మంత్రంగా దర్యాప్తు చేస్తున్నారుతప్ప ముందస్తు తనిఖీలు నిర్వహించడంలో అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారు.ఇది ఎంతవరకు సమంజసమని ఆయన మండిపడ్డారు. ఈ మధ్యకాలంలో ఏ ఒక్క విద్యాసంస్థలకు సంబంధించిన బస్సులను తనిఖీలు నిర్వహించిన దాఖలాలు జిల్లాలో ఎక్కడ కనపడలేదని అన్నారు.అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి జలాల్లో ఉన్నటువంటి విద్యాసంస్థలను సత్వర తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.



# బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా సంగెం రాజు నియామకం

**రాజుకు నియామక పత్రం అందజేసిన ఆర్. కృష్ణయ్య**



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** బీసీ సంక్షేమ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షునిగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నానక్ నగర్ గ్రామానికి చెందిన సంగెం రాజు నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆదేశాల మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ సంగెం రాజును ప్రకటించి ఆర్ .కృష్ణయ్య ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాజు మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ సంఘం పటిష్టత, బలోపేతమే లక్ష్యంగా ప్రతీ బీసీ కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో బీసీ సంక్షేమ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షునిగా నియమించినందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీల హక్కు కోసం ఆర్.కృష్ణయ్య చేసే ప్రతి ఉద్యమంలో తన వంతు పాత్ర పోషిస్తానని చెప్పారు. బీసీల ఐక్యత, బీసీ సమస్యల పరిష్కారం, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నానక్ నగర్ సర్పంచ్ సంగెం చైతన్య, బీసీ నాయకులు ప్రవీణ్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# కుంట్లూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం కుంట్లూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చామా రవీందర్ రెడ్డి సహకారంతో పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు టైలు, బెల్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్, ఎస్ఐలు వెంకట్ రెడ్డి, సంతోష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలలోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. విద్యార్థులు అందరూ కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అడ్వకేట్ బాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యల పరిష్కారానికి దాతలు మరింత ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, సెంట్రల్ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు చుంచు బాల్ రెడ్డి, జంగయ్య, బాల్ చందర్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



**మర్పల్లి, విశాలభారతి:** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని పిలిగుండ్ల గ్రామంలో పెద్ద గొల్ల నర్సింలు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఆకుల పద్మ సంజీవరెడ్డి వారి కుటుంబానికి పరామర్శించి సంతాపం వ్యక్తం చేసి రూ 5,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. మృతుడి కుటుంబానికి అంత్యక్రియల ఖర్చు ఆర్థిక భారం కాకూడదని ఉద్దేశంతో ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భరత్ భూషణ్ రెడ్డి, మొగులయ్య, రాములు, యాదయ్య, భూమయ్య, శివయ్య, నవీన్, శ్రీశైలం, కిష్టయ్య, వీరన్న, మల్లేష్, విట్టల్, తదితరులు ఉన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే 194 జయంతి వేడుకలు



**తిరుమలగిరి, విశాలభారతి:** సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్,మాజీ ఎంపీపీ తిరుమలగిరి మండలం శ్రీ కొత్తగట్టు మల్లన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి మాజీ ఎంపీపీ తిరుమలగిరి మండలం కొమ్మినేని సతీష్ కుమార్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు,మహిళా సామాజిక ఉద్యమ నాయకులు కొత్తగట్టు లలితమ్మ మల్లయ్య, రజక పోరాట హక్కుల మండల అధ్యక్షులు పులిమామిడి సోమన్న, బండ్లపల్లి సర్పంచ్ బర్ల వెంకన్న, ఎండి ఖాసిం, కందుకూరి ప్రవీణ్, గిలకత్తుల రాముగౌడ్, సంగేపాక రవి, మహేశ్వరం జయ చందర్, గంగి బిక్షపతి, పత్తేపురం యాదగిరి, ముద్దంగుల యాదగిరి, పసునూరి శ్రీనివాస్, పల్లెపు సైదులు, చేను శ్రీనివాస్, వంగరి బ్రహ్మం, హనుమాన్, గూడూరి రమేష్ ,పెరమళ్ళ మేరమ్మ ,రాణి, ఆర్కె తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శివాలయంలో విగ్రహాలు ధ్వంసం



**దేవరుప్పుల, విశాలభారతి:** చిన్నమాడూర్ గ్రామంలో కొలిపాక లక్ష్మీనారాయణ అనే వ్యక్తి నిన్న రాత్రి రెండు గంటల సమయంలో శివాలయంలోకి అక్రమంగా ప్రవేశించి హిందు దేవతలను దూషిస్తూ శివాలయంలోని సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం,శ్రీకృష్ణుని విగ్రహం, నందీశ్వర విగ్రహం,కుజుడి విగ్రహం,గణపతి విగ్రహం,పార్వతీదేవి విగ్రహం,నాగ ప్రతిమలు,అష్టోత్తర శత లింగం వీటితోపాటు మైక్ సిస్టం ,కరెంటు మోటర్ మొదలగునవి ధ్వంసం చేసి గ్రామ ప్రజలు,బజరంగ్దళ్ విశ్వహిందూ నాయకుల సమక్షంలో తానే చేసినట్టు అంగీకరించాడు. కావున దీని వెనుక ఉన్నటువంటి నిందితులను హిందూ విద్రోహశక్తులను వదిలి పెట్టకుండా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని దేవరప్పుల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దుబ్బ రాజశేఖర్ గౌడ్, పెద్దగౌని రాజు, మడికొండ మహేష్, మడికొండ కరుణాకర్,చిన్నమాడూర్ గ్రామ ప్రజలు,గ్రామ సర్పంచ్ మైదాం జోగేశ్వర్, ముషీగుంపల వెంకటేష్,ఆలయం పూజారి హరికీర్తి నాని శర్మ, మురళి కృష్ణ, శేషగిరిరావు , మాశెట్టి లక్ష్మీనారాయణ, మందటి గణేష్ జొన్నల సంతు, వంగ దశరథ, కెమెడీ చంద్రశేఖర్, కంకటి రాహుల్, తుమ్మల నవీన్, పెండెల వెంకటేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోండి

**దేవరుప్పల సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్**



**దేవరుప్పుల, విశాలభారతి:** గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ సహకారంతో తేది 04012026 ఆదివారం రోజున ఉదయం 10:00గంటల నుండి సాయంత్రం 04:00గంటల వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరంలో దేవరుప్పుల గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో శ్రీ సరోజిని కంటి హాస్పిటల్ ఫాకో, లేజర్ సెంటర్ జనగామ.డాక్టర్ సి.హెచ్. సృజన్ కుమార్ ఎంబీబీఎస్. ఎం.ఎస్. ఓతల్మోజి (కేఎంసి) కంటి వైద్య,శస్త్ర చికిత్సల ప్రత్యేక వైద్య నిపుణులు గారిచే దేవరుప్పుల మండల పరిసర గ్రామాల ప్రజలకు ఏవైనా కంటి సమస్యలు ఉంటే పైన తెలిపిన సమయానికి వచ్చి డాక్టర్ గారితో పరీక్షలు చేయించుకోవాలని గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణ మూర్తి గౌడ్ గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్ర కోమలతసోమశేఖర్,వార్డు సభ్యులు చిలుకూరి నర్సయ్య,తోటకూరి రమేష్,లొడంగి మంజుల,గోడిశాల శ్రీను,చింత మల్లయ్య,కారుపోతుల సందీప్,ధరావత్ బలరామ్,కార్యదర్శి మధుకర్,కాంగ్రెస్ మండల యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల అనిల్,సరోజినీ కంటి హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

- మహిళా స్వేచ్ఛకు పూలదారులు వేసిన వీరవనిత సావిత్రిబాయి
- అవ్వారి రాజేశ్వరి ప్రధానోపాధ్యాయులు




**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని స్థానిక చందనా పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమ్మవారి రాజేశ్వరి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అవ్వరు రామేశ్వరి మాట్లాడుతూ,భారతీయ విద్యా ఉద్యమం తలపెట్టిన తొలి వీరనారి సావిత్రిబాయి పూలే అని, భారత దేశంలో మొట్టమొదటి పాఠశాల 1848లో పూణే లో స్థాపించిన భారతీయ స్త్రీల శిరోమణి అని,చీకట్లో మగ్గుతున్న మహిళల స్వేచ్ఛకు పూలదారులు వేసిన వీరవనిత అని,సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1952లో మహిళా,సేవా,మండలి అనే మహిళా సంఘాన్ని స్థాపించి ఎన్నో అవమానాలు ఎదుర్కొని అసమానతలను అధిగమించి సామరస్య తను నెలకొల్పిన మహిళా మూర్తి అని,పితృస్వామ్య వ్యవస్థను వ్యతిరేకించి స్త్రీల అభ్యున్నతికి పాటుపడ్డ మహిళ అని తెలిపారు.భారత దేశంలో మొదట భర్త చితికి మెత్తని భార్యగా చరిత్రలో నిలిచిపోయిందని, బాలికల చదువు కోసం ఎన్నో పోరాటాలు చేసిందని ,ఓర్పుతో విజయం సాధించిందని,ఆమెని ఆదర్శంగా తీసుకొని మహిళలందరూ అన్ని రంగాలలో ముందుండాలని ఆ తెలంగాణ ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా దినోత్సవం గా జరుపుకోవాలని అధికారికంగా ప్రకటించారని సావిత్రిబాయి పూలే ని స్ఫూర్తి గాతీసుకొని విద్యార్థినిలు విజయపథంలో నడవాలని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న,పద్మ ,గీత, అర్చన,స్వప్న,జగదీశ్వరి,దీప, లావణ్య,ఉష,తేజ,సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద అంబర్‌పేటలో భారీ అక్రమ లేఅవుట్ కుంభకోణం

నాలా, నక్షా బాట కబ్జాపై అధికారుల నిర్లక్ష్యం - తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్లు 103 నుంచి 159P మధ్య ప్రైవేట్ డెవలపర్లు చేపట్టిన భారీ లేఅవుట్ లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని అడ్వకేట్ పిల్లి శ్రీనివాస్ యాదవ్ తీవ్ర ఆరోపించారు. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఆస్తులకు, ప్రజా రహదారులకు, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని అన్నారు.ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి, హైడ్రా కమిషనర్‌కు, హెచ్ఎండిఏ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. హెచ్ఎండిఏ నిబంధనల ప్రకారం ఒక ఎకరాకు గరిష్టంగా 2750 చదరపు గజాల ప్లాట్ ఏరియా మాత్రమే చూపించాల్సి ఉండగా, సదరు డెవలపర్లు అక్రమంగా 2950 చదరపు గజాలు చూపిస్తూ పబ్లిక్ యుటిలిటీ కోసం వదలాల్సిన స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది స్పష్టమైన టెక్నికల్ ఫ్రాడ్ అని ఆరోపించారు.అలాగే దశాబ్దాల కాలంగా ఉన్న సహజ సిద్ధమైన నాలాను పూడ్చివేసి దానిపై సెప్టిక్ ట్యాంక్ నిర్మించారని, దీని వల్ల వర్షాకాలంలో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. A1 బేకరీ నుంచి బ్యాంక్ కాలనీకి వెళ్లే చారిత్రాత్మక "నక్షా బాట" ను కూడా అక్రమంగా ఆక్రమించి రోడ్డు వెడల్పును తగ్గించారని పేర్కొన్నారు. ఈ అక్రమాలపై స్థానిక ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా యజమానులు యథావిధిగా అక్రమ పనులను కొనసాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఫిర్యాదులను పూర్తిగా విస్మరించి, డెవలపర్లకు అండగా నిలుస్తున్న తీరుపై ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.నాలాలను ఆక్రమిస్తూ అక్రమంగా లేఅవుట్‌లు వేస్తున్న డెవలపర్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, సంబంధిత అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని స్థానిక ప్రజలు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. నాలా కబ్జా కారణంగా చుట్టుపక్కల ఉన్న దాదాపు 10 కాలనీలు వర్షాకాలంలో ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ అక్రమాలకు బాధ్యులైన డెవలపర్లతో పాటు, చర్యలు తీసుకోని ప్రభుత్వ అధికారులు, అక్రమాలకు సహకరించిన స్థానిక ప్రజాప్రతినిధులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్ విభాగం ద్వారా సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల ప్రయోజనాలు, ప్రభుత్వ ఆస్తులు, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఈ పోరాటం కొనసాగిస్తామని అడ్వకేట్ పిల్లి శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

# గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



- గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి
- షాపూర్ సర్పంచ్ పెమిలి బాయ్

**మర్పల్లి, విశాలభారతి:** గ్రామంలో ఏ సమస్య ఉన్న పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామని గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని సర్పంచ్ పెమిలి భాయ్, అన్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని షాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెమిలీ బాయ్ రమేష్ పవర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెమిలీ బాయ్, రమేష్ పవర్ మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని సర్పంచ్ అన్నారు. ముఖ్యంగా అంగన్వాడీలో వంట గదిని ఏర్పాటు కొరకు పరిశీలించడం జరిగిందని అదేవిధంగా పాఠశాలకు ప్రహరి గోడ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో గ్రామంలో ఎటువంటి సమస్యలు ఆయన ఉన్న వస్తే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో తాగునీటి వీధిలైట్లు మురుగు కాలువల శుభ్రత తదితర వంటి అంశాలపై మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సావిత్రిబాయి పూలే చిత్రపటాన్ని ఉంచి ఆమెకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తులసి బాయ్, పంచాయతీ కార్యదర్శి రాములమ్మ, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, అగ్రికల్చర్ ఏఈఓ, జిపిఓ, అంగన్వాడి టీచర్, ఆశా వర్కర్, ఫీల్డ్ అసిస్టెంట్, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మధ్య దయానంద్ జన్మదిన సంబరాలు



- వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ఆకర్షణ
- భారీ బైక్ ర్యాలీతో సత్తుపల్లి ఉత్సవ వాతావరణం
- రక్తదాన శిబిరం, విద్యా సంస్థలకు సామగ్రి పంపిణీ

**సత్తుపల్లి, విశాలభారతి:** సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సత్తుపల్లి నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సత్తుపల్లి పట్టణంలోని వెంగలరావు కాలనీ నుంచి పాత సెంటర్ మీదుగా వేంసూరు రోడ్‌లోని రాణి సెలెబ్రేషన్స్ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్‌తో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణుల నినాదాలతో పట్టణం మొత్తం ఉత్సవ వాతావరణాన్ని సంతరించుకుంది. రాణి సెలెబ్రేషన్స్‌లో వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల మధ్య డా. మట్టా దయానంద్, ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కలిసి కేక్ కట్ చేశారు. జన్మదిన సందర్భంగా అక్కడే రక్తదాన శిబిరాన్ని మట్టా దంపతులు ప్రారంభించి సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచారు. సత్తుపల్లి పట్టణం, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో గ్రామగ్రామాన జన్మదిన సంబరాలు నిర్వహించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రజల బంధువు, సేవకుడిగా గుర్తింపు పొందిన డా. మట్టా దయానంద్ జన్మదిన వేడుకలు ప్రజల మధ్య అత్యంత వైభవంగా సాగాయి.

# సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శ్రమదానం

- స్వచ్ఛ,ఆదర్శంగా గ్రామాన్ని తీర్చిదిద్దుతాం
- సర్పంచ్ రిక్కల మహేందర్ రెడ్డి




**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని ఎల్లగిరి గ్రామంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చేసిన సేవలను, సమాజానికి అందించిన విద్యాసామాజిక కృషిని స్మరించుకుంటూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా సర్పంచ్ రిక్కల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ శ్రమదానం చేపట్టారు. సావిత్రిబాయి పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని,సమానత్వం,విద్య, సామాజిక బాధ్యత వంటి విలువలను గ్రామాభివృద్ధిలో అమలు చేయాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాన్ని స్వచ్ఛంగా,ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి గ్రామ ఉప సర్పంచ్ కందకట్ల సురేందర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్ భవాని తో పాటు వార్డ్ మెంబర్స్ కొత్త మౌనిక బాలరాజు, కొత్త సంతోష నర్సింహా,బాలగోని శివ శంకర్,కొత్త పూజ ప్రవీణ్,మేకల సందీప్ రెడ్డి,పంబాల్ల బాల మల్లేష్, మొహమ్మద్ ఇబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజు పల్లి గ్రామ హరిజన కాలనీలో గల ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు బాస్కుల అంజయ్య ఆధ్వర్యంలో మొదట ఈరోజు రహదారి భద్రత దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేసి శ్రీమతి సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి, పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే దేశంలో తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా సమాజంలో విద్య అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివి అని, ముఖ్యంగా బాలికల విద్య కోసం ఆమె ఎదుర్కొన్న కష్టాలు, త్యాగాలు నేటి తరానికి మార్గదర్శకమని, పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజం ముందుకు సాగుతుందని సావిత్రిబాయి పూలే చూపిన మార్గంలో నడుచుకుంటూ, విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఆకాంక్షించారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులు చదువులో రాణించి భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జి.కలావతి, టి.వేణు, ఆర్.శ్రీశైలం, కె.రాములు, జె.చంద్రయ్య,ఎ.నర్సయ్య,పి.ప్రవీన్, జె.మోహన్, ఎం.రవి, ఎం.యాదగిరి, బుచ్చి రాములు, అంగన్వాడీ ఉపాధ్యాయులు శ్రీలత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

# ఘనంగా మహిళ ఉపాధ్యాయ దినోత్సవం



**కొడంగల్, విశాలభారతి:** సావిత్రిబాయి పూలే 195వ జన్మదినాన్ని పురస్కరించుకొని పీఎం శ్రీ మండల పరిషత్ ప్రాథమిక బాలికల పాఠశాల దౌల్తాబాద్ నందు జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం జరిగింది. పూజా కార్యక్రమం నిర్వహించిన తర్వాత ఉపాధ్యాయులు శ్రీ సాయిలు గౌడ్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 1831 జనవరి మూడవ తేదీన జన్మించారని, ఆకాలంలో అగ్రవర్ణాల వారికి మాత్రమే విద్య అందేదని; స్త్రీలకు, శూద్రులకు, అంటరాని వాళ్లకు చదువు అందేది కాదని తెలిపారు. 09 సంవత్సరాల వయసులోనే జ్యోతిరావు పూలే తో వివాహం జరిగిందని, విద్యపై ఆసక్తి చూసి ఆయన గారు విద్యను ఇంటిదగ్గర ఆమెకు అందించారని, ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేయించారని తెలిపారు. సావిత్రిబాయి పూలే దంపతులు వెనుకబడిన, నిమ్న జాతి, బలహీన వర్గాల వారి కోసం, బాలికల విద్యాభ్యాసం కోసం కృషి చేసి, ప్రత్యేకంగా పాఠశాలలు స్థాపించి విద్యను అందించారని, ఆ కాలంలో గురుకులాలు స్థాపించి బాల బాలికలకు విద్యను అందజేశారని తెలిపారు. ఆధునిక భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పేరు పొందిన సావిత్రిబాయి పూలే గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియపరిచారు. పాఠశాల ఏ ఏ పీ సి చైర్మన్ శ్రీమతి మాసని లక్ష్మి, పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు శ్రీమతి శానమ్మ, శ్రీమతి నవ్యశ్రీ, శ్రీమతి అశ్విని మరియు శ్రీమతి మౌనిక గార్లను శాలువా, పూలమాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, ఉపాధ్యాయులు రమేష్, వెంకటేశం, చంద్రశేఖర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# యూరియా తగినంత సరఫరా చేయాలి




**నడిగూడెం, విశాలభారతి:** రైతులు ఇబ్బందులు పడకుండా తగినంత యూరియాను సరఫరా చేయాలని నడిగూడెం గ్రామ సర్పంచి దున్న శ్రీనివాస్ అధికారులను కోరారు. శనివారం మండల కేంద్రంలోని పిఎసిఎస్ కార్యాలయం లో యూరియా పంపిణీ పట్ల రైతులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ యూరియా కొరకు వచ్చే రైతులకు నీడ కొరకు టెంట్, మంచినీటి సౌకర్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందని తెలిపారు. యూరియా కొరకు రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మండల వ్యవసాయ అధికారి మల్సూర్ మాట్లాడుతూ నడిగూడెం, వల్లాపురం, కాగిత రామచంద్రపురం, తెల్లబల్లి పిఏసియస్ కార్యాలయాల్లో 95 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ కిరణ్ కుమార్ రెడ్డి, ఏఈఓ పిచ్చయ్య, వార్డు నాయకులు రాము, రియాజ్ గోపినాథ్, విజయరామారావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, తరుణ్ రెడ్డి, కోటయ్య, కార్యాలయ సిబ్బంది శ్రీను, ఉపేందర్,ప్రతాప్, సాయి, రైతులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

- 50 సంవత్సరాల వయసు వారికి పెన్షన్ ఇవ్వాలి
- సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్



**విశాలభారతి, గోదావరిఖని:** రాష్ట్రవ్యాప్తంగా విశ్వబ్రాహ్మణులను అన్ని విధాలుగా ఆదుకుంటామని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే శనివారం మర్యాద పూర్వకంగా కలిసి విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందించారు. ప్రధానంగా విశ్వబ్రాహ్మణులకు 50 సంవత్సరాల వయసు వారికి పెన్షన్ ఇవ్వాలని కోరారు. అలాగే పుస్తె మట్టలు తయారీ విషయంలో కేవలం వారికే అవకాశం ఇవ్వాలన్నారు. జువెల్లరీ షాపులలో వీటిని అమ్మకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్వబ్రాహ్మణులు ప్రధానంగా సూక్ష్మ పరంగా (కంటిచూపు) పనులు నిర్వహిస్తారన్నారు. అందుకే కేవలం వీరి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రభుత్వ పరంగా ఉపాధి, భద్రతా కల్పించాలని సీఎం ను కోరారు. ఆయన వెంట పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, దానం నాగేందర్ తదితరులు ఉన్నారు.

# సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డికి ఘనంగా సన్మానం

- ఈ విజయం ప్రైవేట్ పాఠశాల యజమానులందరిది
- మారేపల్లి మల్లారెడ్డి మల్లికార్జున విద్యాసంస్థల చైర్మన్



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని స్థానిక మల్లికార్జున ఉన్నత పాఠశాలలో ట్రస్మా మండల స్థాయి సమావేశము ఏర్పాటు చేయడం జరిగినది.ఈ సందర్భంగా మల్లికార్జున విద్యాసంస్థల కరస్పాండెంట్ మారేపల్లి మల్లారెడ్డి స్థానిక సంస్థ ఎన్నికలలో కొమ్మాయిగూడం గ్రామ సర్పంచిగా గెలుపొందిన సందర్భంగా స్థానిక ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్లు ఘనంగా సన్మానించారు.అనంతరం మారేపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ విజయం ప్రైవేట్ పాఠశాల యజమానులు అందరిదని అయన అన్నారు. అందరి కృషి వలన తాను కొమ్మాయిగూడం గ్రామ సర్పంచిగా గెలుపొందానని మీ అందరి సహకారం మరియు కొమ్మాయిగూడెం ప్రజల ఆధార అభిమానులతో గెల్పొందాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు పాలకూర వెంకటేశ్వర్లు,రాష్ట్ర ఉపాధ్యక్షులు కే వి బి కృష్ణారావు,ట్రస్మా మండల అధ్యక్షులు టి కృష్ణంరాజు,జనరల్ సెక్రటరీ ఎస్ డి సయ్యద్,ట్రెజరర్ కే శ్రీనివాస్ మరియు ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఉజ్జిని మంజుల,శ్రీకాంత్ గోదాదేవి,షమీం,మల్లేష్,అరుణ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ విస్తృత సమావేశం



- కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యం
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం నియోజకవర్గ బీ.ఆర్.ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం అడ్డగుంటపల్లి సిరి ఫంక్షన్ హాల్లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ తెలిపారు. రామగుండం కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలో బీ.ఆర్.ఎస్ పార్టీ గెలుపు లక్ష్యంగా ముందుకు సాగడం జరుగుతుందని. డివిజన్ వారిగా సమన్వకమిటిలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. బీ.ఆర్.ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. రెండు సంవత్సరాల కాలంగా రామగుండం నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పేరిట చేస్తున్న విధ్వంసం, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిలు నేరవెర్చకుండా ప్రజలను మోసాలను చేసిన విధానాలను ప్రతి ఇంటికి తీసుకువేళ్లేలా పార్టీ శ్రేణులను సమయత్తం చేయడం జరుగుతుందని పెర్కోన్నారు. ఇటివల జరిగిన గ్రామపంచాయతి ఎన్నికల్లో గెలుపోందిన సర్పంచ్ లను వార్డు మెంబర్లకు సన్మానం కార్యక్రమం నిర్వహించండం జరిగుతుందని. రామగుండం నియోజకవర్గం లోని మాజీ ప్రజా ప్రతినిధులు, పట్టణ మండల పార్టీ అధ్యక్షులు బీ.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులు పాల్గోని విజయవంతం చేయాలని కోరారు.

# సర్పంచ్ జలై జాకును సన్మానించిన ఏలేటి అశ్విన్ రెడ్డి



**విశాలభారత్, ఆదిలాబాద్:** ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చోడ సర్పంచ్గా గెలుపొందిన జలై జాకుని నేరడిగొండ క్యాంపు కార్యాలయంలో ఏలేటి అశ్విన్ రెడ్డి సన్మానించారు. అశ్విన్ రెడ్డి మాట్లాడుతూ డబ్బుతో కాకుండా ప్రేమతో ప్రజల మనసులు గెలవచ్చని నిరూపించిన జాకు అన్ని శుభాకాంక్షలు తెలియచేస్తూ మీ నాయకత్వంలో ఇచ్చోడ ని మరింత అభివృద్ధి పథం వైపు ముందుకు తీసుకెళ్లాలని మీ వెనకాల ఎల్ల వేళల నా సహాయసాకారాలు ఉంటాయని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడే వసంత్ ,ఇచ్చోడ మండల్ కన్వీనర్ నారాయణ్ రెడ్డి ,మాజీ ఎంపీటీసీ ప్రవీణ్ రెడ్డి ,బోరిగామ సర్పంచ్ అసిఫ్ ఖాన్ ,నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా ,బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్ ,సొనల మాజీ సర్పంచ్ సోయం బాపురావు ,సీనియర్ నాయకులు షఫీ అహ్మద్ ,రాజు రెడ్డి ,శ్రీకాంత్ రెడ్డి ,శివ కుమార్ ,నరేష్ రెడ్డి ,రామ్ లక్ష్మణ్ గౌడ్ ,ఖదీర్ ,వాజిద్ ,ఫారూఖ్ తదితరులు ఉన్నారు .

# ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి జరిగింది
- అసెంబ్లీలో స్పష్టం చేసిన రామగుండం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్



**విశాలభారతి, రామగుండం:** రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో జరిగిన సమావేశంలో ఆయన నియోజకవర్గ అభివృద్ధి గురించి ప్రస్తావించారు. గోదావరి నది పరీవాహక ప్రాంతంలో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టామని. అయితే ప్రతిసారి గోదావరి వచ్చే సమయంలో ఈ నిర్మాణాలు నది వరద నీటితో నిండుకుంటున్నాయని పేర్కొన్నారు. అలా కాకుండా ఈసారి ప్రత్యేక నిధులు కేటాయిస్తే మరమ్మతులు చేసి నిరుపేదలకు అందిద్దామని పేర్కొన్నారు. వైయస్సార్ సర్కారు హయాంలోనే సుమారు 18వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని గుర్తు చేశారు. అలాగే ఈసారి ఈ ప్రాంతంలో కాంట్రాక్టు కార్మికులు అధికంగా ఉన్నారని వారి బతుకుదెరువు కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేద్దామని పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క పరిశీలించి ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఆయన అసెంబ్లీ సమావేశంలో ప్రత్యేకంగా కోరారు.

# ఆదివాసీలు విద్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్
- ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను సంప్రదించాలి
- ఉచిత వైద్య శిబిరం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం



**విశాలభారతి, ఆదిలాబాద్:** మారుమూల ఆదివాసి గిరిజన గ్రామ ప్రజలకు పోలీసులకు మధ్య సత్సంబంధాలు మెరుగుపరచాలని, వైద్య సదుపాయాలు మరింత చేరువ చేసే ఉద్దేశంతో మరియు చలి కాలం దృష్ట్యా శనివారం బజార్హత్నూర్ మండలం డెడ్రా గ్రామం నందు ఆదివాసీలకు ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరం నందు మాన్కాపూర్, గోసాయి,గిరిజై, ఇంద్రానగర్, బద్దు నాయక్ తండ, భూతాయి కె గ్రామాల 200 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం, ఆదిలాబాద్ నుండి ప్రముఖ ప్రైవేటు వైద్యుల సహాయంతో నిష్ణాతులైన డాక్టర్లచే నిర్వహించబడింది. ఈ వైద్య శిబిరం నందు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీలు విద్యకు మొదటి ప్రాధాన్యత కేటాయించాలని, నాటు వైద్యాన్ని నమ్మకుండా ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను సంప్రదించాలని సూచించారు. అభివృద్ధిని కోరుకునేవారు సంఘవిద్రోహశక్తులకు దూరంగా ఉండాలని అలాంటి వారి సమాచారం వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని తెలిపారు. గంజాయి నిర్మూలనకై జిల్లా పోలీసులు చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని, గంజాయి పండించడం, రవాణా చేయడం, సేవించడం, చట్ట రీత్య నేరమని, గంజాయి అలవాటు పడిన వారికి డి అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్సను అందజేయడం జరుగుతుందని తెలిపారు. గంజాయి పండించడం వల్ల ప్రభుత్వ పథకాలు రాకుండా ఉంటాయని తెలిపారు. అదేవిధంగా ఆదివాసి యువత కోసం ప్రత్యేకంగా త్వరలోనే జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు పాల్గొని వరంగల్ హైదరాబాద్ లాంటి నగరాలలో ఉద్యోగాలకై వెళ్లవలసి ఉంటుందని, గ్రామాలను వదిలి ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలను సాధించి గ్రామాల పేరును, కీర్తి ప్రతిష్టలను పెంచేలా కష్టపడి చదవాలని సూచించారు. డెడ్రా గ్రామంలో చదువుతున్నటువంటి విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు .అదేవిధంగా డెడ్రా మరియు కోలాంగూడ గ్రామాలలో ప్రజలకు 500 దుప్పట్లను పంపిణీ చేసి ఆదివాసీలకు చలికాలంలో తోడ్పాటును అందించారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్, ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సీఐ డి గురు స్వామి, ఎస్సైలు సంజయ్ కుమార్, శ్రీ సాయి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదిలాబాద్ అధ్యక్షుడు డాక్టర్ వెంకటరెడ్డి, మరియు డాక్టర్లు అభిజిత్, శిల్పా సందీప్, హేమలత, స్వాతి, సందీప్ రెడ్డి, సాయి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీసు వైద్య బృంద సభ్యుడు శాంత రాజ్, డెడ్రా గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, లింగు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# గణిత మేధావిని అభినందించిన జిల్లా ఎస్పీ

- కానిస్టేబుల్ కుమార్తె జరిషా మెహ్విన్ జిల్లాస్థాయి విజ్ఞాన మేళాలో మొదటి బహుమతి సాధించింది
- గణిత శాస్త్రం నందు "పారడాక్సెస్" విషయంలో సాధించిన మొదటి బహుమతి
- 9వ తారీఖున జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థిని
- అభినందించిన జిల్లా ఎస్పీ, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వాదం



**విశాలభారతి, ఆదిలాబాద్:** డిసెంబర్ 19, 20 తారీకులలో ఆదిలాబాద్ జిల్లా నందు జరిగిన విద్యార్థినీ విద్యార్థుల విజ్ఞానమేల ప్రదర్శనలో ఆదిలాబాద్ పోలీసు ముఖ్య కార్యాలయం నందు విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ ఎండి మజీద్ అహ్మద్ కుమార్తె జరిషా మెహ్విన్ గణిత శాస్త్రం నందు పారడాక్సెస్ అనే విషయంలో మొదటి బహుమతిని సాధించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ విద్యార్థిని ఆహ్వానించి పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆశీర్వదించారు. పోలీసు కుటుంబం పిల్లలు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఉన్నత చదువులను అభ్యసించాలని జిల్లా ఎస్పీ నిరంతరం సిబ్బందికి తెలియజేస్తూ ఉంటారు. అందులో భాగంగానే ఈ విద్యార్థి ఈనెల ఏడవ తారీఖు నుండి 9వ తారీఖు వరకు కామారెడ్డి నందు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి బహుమతులను సాధించాలని ఆశీర్వదించారు. స్థానిక ప్రైవేట్ పాఠశాల నందు ఎనిమిదవ తరగతి అభ్యసిస్తున్న ఈ విద్యార్థిని చక్కటి ప్రదర్శనను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగమాధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ పూర్తి చేసుకున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ అభ్యర్థులు




**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం ఏరియా వన్ ఆధ్వర్యంలో తిలక్ నగర్ లో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారాఎం.ఎస్.ఎం.ఇ సౌజన్యంలో సింగరేణిసంస్థ అర్జీ.వన్ ఏరియా ఆధ్వర్యంలోయువతీ యువకులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ 30 మంది మరియుకంప్యూటర్ గ్రాఫిక్స్ డిజైనింగ్. 30మందికి 45రోజుల పాటు వృత్తి శిక్షణ శనివారం రోజు పూర్తి అయినా సందర్భంగా శనివారం రోజున జరిగిన వ్యాల్డిక్టరీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్.జి.వన్ ఏరియా జిఎం డి.లలిత్ కుమార్ హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది. అర్.జి.వన్ ఏరియా జిఎం మాట్లాడుతూ సింగరేణి ద్వార నిరుద్యోగ యువతీ, యువతులకు ఎన్నో రకాల వృత్తి శిక్షణ తరగతులను అందిస్తున్నామని, తద్వారా అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాది లబిస్తుందని జిఎం తెలిపారు. ఇందులో భాగంగా ఈ రోజు స్కిల్డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ఎం.ఎస్.ఎం.ఇ సౌజన్యంలో సింగరేణి ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ మరియు కంప్యూటర్ గ్రాఫిక్స డిజైనింగ్ 45 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శుభాకాంక్షలుతెలిపారు. ఇప్పుడున్న పోటి ప్రపంచం లో మీరు నేర్చుకున్న కోర్సుల ద్వారా అనేక ఉద్యోగ, ఉపాది అవకాశాలు పొందాలని జి.ఎం కోరారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు.జియం. కే.చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్ రెడ్డి, దశరథం డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ ఎంఎస్ఎంఇ, మస్తాన్ ఖాన్ ఎన్.జి.ఓ మరియు ఏరియా ఇంజనీర్ కే.రామ్మోహన్, వి.టి.సి మేనేజర్ పి.మాధవ రెడ్డి, మురళి కృష్ణ యస్.డి.సి ఇంచార్జ్, సీనియర్ పిఒలు శ్రావణ్ కుమార్, సిబ్బంది శేషు, రవీందర్రెడ్డి, ట్రేనర్స్ శ్రీనివాస్, హాజిమలన్ ఖాన్, టేక్నిషియన్ యాకుబ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బ్యాంకుల్లో భద్రతపై గోదావరిఖని వన్ టౌన్ సీఐ తనిఖీ



**విశాలభారతి, గోదావరిఖని:** ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు భద్రతా చర్యల్లో భాగంగా గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ పక్కన ఎస్బిఐ బ్యాంక్, న్యూ అశోక్ థియేటర్ పక్కన యూనియన్ బ్యాంక్, మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న హెచ్డీఫ్సీ బ్యాంక్,రమేష్ నగర్ లోని యూనియన్ బ్యాంక్ లలో, గోదావరి అర్బన్ బ్యాంక్ మున్సిపల్ ఆఫీస్,బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గోదావరి అర్బన్ బ్యాంక్ మున్సిపల్ ఆఫీస్, ఇండియన్ బ్యాంక్ అలహాబాద్ బ్యాంక్ మార్కండేయ కాలనీ, గాయత్రి బ్యాంక్ లక్ష్మీ నగర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ లక్ష్మీ నగర్, ఎటిఎం సెంటర్ లను గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తనిఖీలు నిర్వహించారు. అదేవిదంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని మిగతా బ్యాంకుల్లో భద్రతపై ఎస్ ఐ అనూష, క్రైమ్ పార్టీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో, ఏటీఎంల వద్ద తనిఖీలు నిర్వహించారు. నేరా నియంత్రణ ముందస్తు చర్యలలో భాగంగా బ్యాంక్, ఎటిఎం సెంటర్లలో అలారం పనిచేసేలా చూడాలని, అదేవిధంగా హై రిజల్యూషన్ కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనీ అవి పని చేస్తున్నాయా లేదా తప్పనిసరిగా చెక్ చేయాలనీ సూచించి అందులో రికార్డు అయినా దృశ్యాలు, ఫోటో లు చెక్ చేయడం జరిగింది. ఏదైనా నేరం జరిగినప్పుడు సీసీ కెమెరాలు వలన నిందితులను గుర్తించడానికి, అనుమానాస్పద వ్యక్తులు బ్యాంకు ఏటీఎం పరిసరాల్లో తిరిగినా కూడా గుర్తించే అవకాశం ఉంటుందని సీఐ బ్యాంక్ అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ. సీసీ టీవీ కెమెరాలు బ్యాంకులు భద్రత ప్రయోజనాల కోసం కలిగి ఉండాలని సూచించారు. తదనుగుణంగా బ్యాంకు భద్రతాంశాలపై బ్యాంకు ఆవరణ అంతా కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్, సెక్యూరిటీ గార్డ్, సీసీ కెమెరాలు, లైటింగ్, సెక్యూరిటీ గార్డ్ ఏర్పాటు, బ్యాంకుల్లో భద్రతా లోపాలు ఉండకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. బ్యాంక్ కు వచ్చే కస్టమర్ లకు ఎవరైనా ఎక్కువ సమయం బ్యాంక్ లో ఉన్నట్టు అనుమానస్పదంగా అనిపిస్తే సమాచారం చెప్పాలని, బ్యాంకు నుండి డబ్బులు డ్రా చేసుకొని వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా కస్టమర్లకు అవగాహన కల్పించాలని బ్యాంక్ అధికారులకు గోదావరిఖని వన్ టౌన్ సిఐ సూచించారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు




**విశాలభారతి, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద సావిత్రిబాయి పూలే 195వ జయంతిని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి అన్నలా లక్ష్మణ్ మాట్లాడుతూ అభ్యుదయవాది సంఘసంస్కర్త సత్యశోధక మండలి సహ వ్యవస్థాపకురాలు అని కొనియాడారు . ఇచ్చోడ గ్రామ ఉపసర్పంచ్ లోక సిరిసిరెడ్డి మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి మాట్లాడుతూ శ్రీ విద్యా హక్కులకు కృషి చేసిన వీర వనిత సామాజిక రుగ్మతలపై పోరాడి అణగారిన వర్గాలకు అండగా సావిత్రిబాయి నిలబడిందని తెలియజేశారు మరియు బీసీ జేఏసీ మండల అధ్యక్షులు నరాల రమణయ్య మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తొలి మొదటి భారతీయ ఉపాధ్యాయురాలు అని తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి పిల్లి నరేష్ సామాన్ పెల్లి సుదర్శన్ శ్రీనివాస్ యాదవ్ గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్స్ కొల్లూరి చంద్రశేఖర్ పొనకంటి ఆశన్న, శమ్ము, పి ఎల్ సింగ్ రాజేశ్వర్ రెడ్డి దర్శనాల అశోక్ కొత్తూరి లక్ష్మణ్ అనెల లక్ష్మణ్ బిజెపి మండల అధ్యక్షులు టెహరే రమేష్ లు పాల్గొన్నారు.

# సేవాలాల్ జయంతిని జాతీయ సెలవుదినంగా ప్రకటించాలి



**విశాలభారతి, ఆదిలాబాద్ జిల్లా:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో గౌరవనీయులు జి.నగేష్ ఎంపీ ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ చేసిన జై సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరేందర్ నాయక్ , వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కృష్ణ నాయక్,రాష్ట్ర కార్యదర్శి అశోక్, రోహిదాస్ ,జాదవ్ రవి,రాథోడ్ మనోజ్ తదితరులు ఉన్నారు.బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జన్మదినమైన ఫిబ్రవరి 15 ను జాతీయ సెలవుగా ప్రకటించాలని పార్లమెంట్ లో ప్రస్తావించి ఆమోదం చేసే విధంగా కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరేందర్ నాయక్ ఎంపీ నగేష్‌కి తెలియచేశారు.

# ఘనంగా చదువుల తల్లి జయంతి వేడుకలు




**మునుగోడు, విశాలభారతి:** మండల కేంద్రంలోని ఎంపీపీ ఎస్ ప్రైమరీ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు దుబ్బ పురుషోత్తం, రెడ్డిమల్ల వెంకటేష్,శనివారం రోజున చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 195 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు,అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ బుక్స్ తో పాటు పెన్నులు,అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. మహిళల చదువు కోసం పోరాడిన భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అయిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అణగారిన వర్గాల పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నతమైన మహిళ శక్తి అని కొనియాడరూ,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ముచ్చపోతుల శ్రీనివాస్, దుబ్బ పురుషోత్తం, రెడ్డిమల్ల వెంకటేష్, దుబ్బ విజయ భాస్కర్, దుబ్బ అనిల్, ఏర్పుల క్రాంతి కుమార్,శేఖర్ అధ్యాపకురాలు,అపర్ణ, లక్ష్మీ ప్రసన్న, భవాని, త్రివేణి విద్యార్థులు,తదితరులు, పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన నియమాలు పాటించాలి




**కోదాడ, విశాలభారతి:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా కోదాడ పట్టణంలోని సిటీ సెంట్రల్ స్కూల్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మోటార్ వాహనాల విభాగం, కోదాడ యూనిట్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్ ఎంవిఐ, జిలాని షేక్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు, హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నియమాలు పాటించడం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. చిన్న వయసు నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండటం ప్రాణ రక్షణకు కీలకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్ ఏఎంవిఐ, జి.ఆర్. చరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్ పై కేసు నమోదు

**దేవరప్పుల, విశాలభారతి:** మండలంలోని రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఘటనకు సంబంధించి కేసు నమోదు, అయినట్లు దేవరప్పుల ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు. రాజు అనే రెవెన్యూ ఇన్స్పెక్టర్ దేవరుప్పుల ఇచ్చిన దరఖాస్తు మేరకు తేదీ 212026 శుక్రవారం రోజున ఎమ్మార్వో అశ్వక్ అహ్మద్ కొడకండ్ల మండలం నర్సింగాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ట్రాక్టర్లకు ఇసుక పర్మిషన్ మంజూరు చేశారు. ఆ పర్మిషన్ ప్రకారం టాక్టర్ డ్రైవర్లు ఇసుక కోసం దేవరుప్పుల మండలంలోని దాదాసాహెబ్ కాలనీ సమీపంలోని దేవరుప్పుల వాగు వద్దకు వెళ్లారు, ఈ సందర్భంగా దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను అడ్డుకొని ఇసుక పర్మిషన్ ఇచ్చిన ఎమ్మార్వోని అసభ్య పదజాలాలతో దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి అక్కడ సిబ్బందిని విధులు నిర్వహించకుండా ఆటంకం కలిగించినట్లు ఆరోపణలు ఉన్నాయి, ఈ సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు దేవరుప్పుల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు.

# దమ్మపేట మండలంలో యూరియా కొరత లేదు

- యాసంగి రైతులకు భరోసా – ప్రభుత్వ ముందస్తు ప్రణాళికలు ఫలితం
- అపోహలు నమ్మవద్దు – వ్యవసాయ శాఖ సంచాలకులు పి. రవికుమార్
- యాసంగి–2026కు సరిపడా యూరియా నిల్వలు – ప్రభుత్వ ఏర్పాట్లు
- ఇప్పటివరకు 8,200 బస్తాల పంపిణీ పూర్తి – సరఫరాపై నిరంతర పర్యవేక్షణ
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ – అధికారుల కట్టుదిట్టమైన చర్యలు



**అశ్వారావుపేట, విశాలభారతి:** యాసంగి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు ప్రణాళికలు దమ్మపేట మండలంలో స్పష్టంగా ఫలితాలివ్వడం ప్రారంభించాయి. ఎరువుల కొరత అనే మాటే రాకుండా, రైతులకు అవసరమైన యూరియా సరఫరాను క్షేత్రస్థాయిలో భద్రపరిచినట్లు అశ్వారావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి. రవికుమార్ స్పష్టం చేశారు. రైతులు అనవసర అపోహలకు లోనుకావద్దని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందుబాటును కల్పించిందని ఆయన తెలిపారు. దమ్మపేట మండల కేంద్రంలోని మల్లారం గ్రామ రైతు వేదికలో యాసంగి పంటల సాగు, ఎరువుల లభ్యతపై విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత అవసరాలతో పాటు రాబోయే రోజుల్లో పంటల విస్తీర్ణం పెరిగినా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందుగానే సమగ్ర కార్యాచరణ రూపొందించిందని అన్నారు. సరఫరా, నిల్వలు, పంపిణీ——మూడు స్థాయిల్లో పర్యవేక్షణతో వ్యవసాయ శాఖ పనిచేస్తోందని స్పష్టం చేశారు.

యాసంగి-2026 సీజన్‌లో అశ్వారావుపేట డివిజన్ పరిధిలో మొత్తం 25,198 ఎకరాల్లో పంటల సాగు జరుగుతోందని తెలిపారు. ఇందులో వరి 9,144 ఎకరాలు, మొక్కజొన్న 10,009 ఎకరాలు, వేరుశనగ 2,098 ఎకరాలు, పొగాకు 2,255 ఎకరాలు, ఇతర పంటలు 1,681 ఎకరాల్లో సాగవుతున్నాయని వివరించారు. సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకునే ఎరువుల నిల్వలు సిద్ధంగా ఉంచామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు యూరియా ఎరువులను ప్రైవేటు, సహకార సంఘాల ద్వారా నిరంతరంగా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 8,200 బస్తాల యూరియా పంపిణీ పూర్తైందని, ప్రస్తుతం 7,254 బస్తాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. పంటల పెరుగుదల దశల్ని బట్టి రైతులకు సరైన సమయంలో యూరియా అందేలా వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు.

ప్రతి మండలంలో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు యూరియా పంపిణీ కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. యాసంగి సీజన్‌లో రైతుల అవసరాలను పూర్తిగా తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అదేవిధంగా వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా లేదా మీసేవ కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకుంటే కేంద్ర ప్రభుత్వ పథకాలు నిరాఘాటంగా అమలవుతాయని తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో దమ్మపేట మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా విద్య అభివృద్ధికి కృషి చేయాలి



**కోదాడ, విశాలభారతి:** సావిత్రిబాయి పూలే స్పూర్తితో మహిళా విద్య అభివృద్ధికి కు కృషి చేయలని కోదాడ మున్సిపల్ మాజీ క్రిస్టియన్ మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలు వంటేపాక జానకి యేసయ్య అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుక లను పట్టణంలోని స్థానిక నయా నగర్ బాప్టిస్ట్ చర్చిలో యునైటెడ్ పాస్టర్స్ నియోజకవర్గ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి జానకి యేసయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశంలోని మహిళల విద్య కోసం సావిత్రిబాయి పూలే త్యాగం మరువలేనిదని ఆమె తెలిపారు విద్యను ఆయుధంగా చేసుకుని సమానత్వం కోసం పోరాడిన ఆమె జీవితం దేశ మహిళలందరికీ మార్గదర్శకమైన తెలిపారు విద్య ద్వారానే మహిళలు బలహీనవర్గాలు స్వాలంబన అభివృద్ధి సాధ్యమని తెలిపారు నేటి విద్యావంతులైన మహిళలు సామాజిక రుద్రాల నిర్మూలనకై కృషి చేయాలని ఆమె తెలిపారు విద్యావంతులైన మహిళలు నిరక్షరాశులకు విద్యను నేర్పి విద్యావంతులు చేసినట్లయితే ఆమెకు మనం ఇచ్చే ఘన నివాళులు అని తెలిపారు ఈ కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు ప్రభుదాస్ అన్ని బాగా కోటయ్య మేరా బి మరియమ్మ శ్రావ్య చిన్న సైదులు ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి భాయ్ పులే త్యాగం మరువలేనిది

- సర్పంచ్ స్నేహ దుర్గయ్య



**కోదాడ, విశాలభారతి:** ఈ దేశంలోని మహిళల విద్య కోసం సావిత్రిబాయి పులే త్యాగం మరువలేనిదని గణపవరం గ్రామ సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య అన్నారు మండల పరిధిలోని గణపవరం గ్రామంలో శనివారం భారతదేశపు తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ స్నేహ దుర్గయ్య సావిత్రిబాయి పూలే చిత్రపటానికి గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల విద్య కోసం సావిత్రిబాయి త్యాగం విద్యనే ఆయుధంగా చేసుకొని సమానత్వం కోసం పోరాడిన ఆయన జీవితం దేశ మహిళలందరికీ మార్గదర్శకమని తెలిపారు . విద్య ద్వారానే మహిళలు, బలహీన వర్గాలు, స్వాలంబన అభివృద్ధి సాధ్యమని తెలిపినారు. విద్యావంతులైన మహిళలు సామాజిక రుగ్మతల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శంకర్ శెట్టి కోటేశ్వరరావు ,9వ వార్డు నెంబర్ బండి చిన్నకోటయ్య, మాజీ సర్పంచ్ పొట్ట విజయ కిరణ్, గురవయ్య, కాసాని సత్యం, లక్ష్మయ్య, ధనమూర్తి, కే వెంకన్న ,ఎం కృష్ణారావు ,స్రవంతి, శ్రీను, శ్రీనివాసరావు ,కొండలు, నాగస్వరూప, పాండు, ఉపాధ్యాయులు లు ఆశా వర్కర్లు ,సిబ్బంది, ఏఎన్ఎం, సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బంచరాయితండలో కంటి వెలుగులు

- సర్పంచ్ కమిలి పుల్య చొరవతో ఉచిత వైద్య సేవలు
- సూర్య స్వచ్ఛంద సేవా ట్రస్ట్ కంటి పరీక్షల శిబిరం



**కురవి, విశాలభారతి:** బంచరాయితండ గ్రామంలో సర్పంచ్ బదావత్ కమిలి పుల్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షల కార్యక్రమం గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోంది. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని ప్రధానంగా తీసుకుని చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల అన్ని వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కంటి పరీక్షల శిబిరాన్ని సూర్య స్వచ్ఛంద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో, అంధత్వ నివారణ రంగంలో విశేష సేవలందించి ప్రభుత్వ ప్రశంస పత్రాలు పొందిన లయన్ డాక్టర్ అడిచర్ల మాధవరావు నిర్వహించారు. అనుభవజ్ఞులైన వైద్య బృందం సమక్షంలో గ్రామస్తులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ మాధవరావు మాట్లాడుతూ, “ఈ శిబిరం ద్వారా వృద్ధులు, మహిళలు, పిల్లలు సహా ప్రతి ఒక్కరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. కంటి చూపు లోపాలను ముందుగానే గుర్తించి అవసరమైన మందులు, సూచనలు అందిస్తున్నాం. తీవ్రమైన సమస్యలు ఉన్నవారిని శస్త్రచికిత్సల కోసం సంబంధిత ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నాం” అని తెలిపారు. గ్రామంలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

## ప్రత్యేక రేషన్ షాపు ఏర్పాటు చేయాలి

- గ్రామ సర్పంచ్ బానోత్ రమేష్ నాయక్



**కురవి, విశాలభారతి:** పిల్లిగుండ్ల తండా గ్రామ ప్రజలకు సౌకర్యార్థం ప్రత్యేక ప్రభుత్వ రేషన్ షాపు ఏర్పాటు చేయాలని పిల్లిగుండ్ల తండా గ్రామ సర్పంచ్ బానోత్ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం గ్రామ పెద్దలతో కలిసి కురవి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ.., మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో నూతనంగా ఏర్పాటైన పిల్లిగుండ్ల తండా గ్రామ పంచాయతీ ప్రజలు రేషన్ బియ్యం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాట్యా తండాలో ప్రభుత్వ రేషన్ షాపు ఉండటంతో పిల్లిగుండ్ల తండా ప్రజలు అక్కడికి వెళ్లాల్సి వచ్చేదని, మధ్యలో రైల్వే ట్రాక్ ఉండటంతో వృద్ధులు, వికలాంగులు, మహిళలు తీవ్ర ప్రమాదాలను ఎదుర్కొంటూ రేషన్ తీసుకువెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. రైల్వే ట్రాక్ దాటే క్రమంలో పలు మార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పిల్లిగుండ్ల తండాకు ప్రత్యేకంగా ప్రభుత్వ రేషన్ షాపు మంజూరు చేసి ప్రజలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రామావత్ నీల గోపి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు భూక్య సోమల, నాయకులు భూక్య బక్షా నాయక్, భూక్య కృష్ణ, భూక్య శివ, భూక్య లింగ, లూనావత్ సురేష్, లూనావత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

- భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు
- భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జి వి రామిరెడ్డి



**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ సెంటర్కు చెందిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు డివి శంకర్రావు హర్యానాలోని ఫరీదాబాద్ లో జరిగే జాతీయస్థాయి బెంచ్ ప్రెస్ పోటీలకు ఎంపికైనట్లు భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి తెలిపారు. ఖమ్మంలో జరిగిన రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్ ఛాంపియన్షిప్ పోటీలలో బంగారు పతకాన్ని సాధించిన శంకర్ రావు ఈ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ ఎంపికైన క్రీడాకారుడు గతంలో కేరళలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ లో నాలుగు బంగారు పతకాలు సాధించడం జరిగింది . ఈ పోటీలకు ఎంపికైన క్రీడాకారుని తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఉపాధ్యక్షులు వి మల్లేష్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు, భోగాల శ్రీనివాస్ రెడ్డి, పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, పట్టణ ప్రముఖులు, రాజకీయనాయకులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు , శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, సిటీ స్టైల్ జిమ్ సభ్యులు తదితరులు అభినందించడం జరిగింది.

## ఇళ్లను కూల్చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం



- గిరిజనులకు అండగా నిలుస్తాం
- చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్ద మంగళారం రెవెన్యూలో సర్వే నంబర్లు 210, 211, 212లలో గిరిజనులు న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేసి అన్ని అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్నారని సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ తెలిపారు. కొంతమంది రాజకీయ పెద్దలు, రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ప్రోత్సాహంతో మున్సిపల్ అధికారులు గిరిజనుల ఇళ్లను కూల్చివేయడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన పేర్కొన్నారు. సిపిఎం మొయినాబాద్ మండల కార్యదర్శి సిహెచ్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కూల్చివేతకు గురైన ఇళ్లను పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ, 111 జీఓ సాకుతో పేద గిరిజనుల ఇళ్లను కూల్చివేస్తూ, ధనికుల ఫామ్ హౌసులు, రిసార్ట్స్, కమర్షియల్ బిల్డింగ్స్‌పై మాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పేదలపై మాత్రమే ప్రతాపం చూపడం అన్యాయమని అన్నారు. ఇళ్ల కూల్చివేతకు కారణమైన రియల్ ఎస్టేట్ బ్రోకర్లు రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, జి. శ్రీనివాసరాజు, డి. సురేష్ రెడ్డిలపై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇళ్లను కూల్చిన మున్సిపల్ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మొయినాబాద్ మండల నాయకులు మహేందర్, రాజేందర్, చెన్నయ్య, నరసింహ, ప్రభుదాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సింగిడికేట్ల వలనే విచ్చలవిడిగా వెలసిన బెల్ట్ షాపులు

- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్



**అశ్వాపురం, విశాలభారతి:** మండలంలోని సిండికేట్ వ్యాపారం వలనే విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలిశాయని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చింతిర్యాల క్రాస్ రోడ్ లో ఉన్న వైన్ షాపులలో అన్ని రకాల బ్రాండ్లతో కూడిన మద్యాన్ని అందుబాటులో ఉంచి ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని డిమాండ్ చేశారు. మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి వైన్ షాపులలో మద్యపాన ప్రియులకు అవసరమైన అన్ని రకాల బ్రాండ్లను ఉంచకుండా నామమాత్రపు మద్యంతో షాపులను నిర్వహిస్తు న్నారన్నారు. సామాన్యుల అవసరాలకు అనుగుణంగా మద్యం ఉంచడం లేదన్నారు. వైన్ షాపుల టెండర్లు వేసే సందర్భంలో ప్రభుత్వ, ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం మద్యం అమ్మకాలు చేపడతామని నిబంధనతో టెండర్లు వేసి షాపులు దక్కించుకున్న వ్యాపారులు షాపులు ఏర్పాటు చేసి అమ్మకాలు చేపట్టే తరుణంలో మందుబాబులకు అవసరమైన ఒక బ్రాండ్ ను కూడా వైన్ షాపుల్లో పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్సుడ్ వైన్ షాపుల్లో నాసిరకం, ఎటువంటి పేరు ప్రఖ్యాతలు లేని మద్యాన్ని విక్రయిస్తూ అసలు మద్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇది కేవలం షాపులు దక్కించుకున్న వారందరూ కుమ్మక్కై పెట్టిన పెట్టుబడులను అనతి కాలంలోనే రాబట్టుకోవాలన్న లక్ష్యంతోనే సిండికేట్లుగా ఏర్పడి గొలుసుకట్టు షాపులను ప్రోత్సహిస్తున్నారన్నారు. వైన్ షాపుల్లో దొరకని మద్యం బెల్ట్ షాపుల్లో ఎలా దొరుకుతుందని ఆయన ప్రశ్నించారు. మండలంలో విచ్చలవిడిగా ఏర్పడిన బెల్టు షాపుల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ మందుబాబుల జేబులకు కన్నం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీ ధరల కంటే రూ. 40 నుండి 50లు అధిక రేట్లకు అమ్ముతూ సామాన్యుల కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నారన్నారు. మద్యం వ్యాపారులు సిండికేట్లుగా మారి మండలంలో ప్రత్యేకంగా మద్యం నిలువల కోసం భవనాలను తీసుకొని అందులో మద్యం నిలువలని పెట్టి బెల్టు షాపులకు ప్రతి కోటర్ బాటిల్ పై ఎమ్మార్పీ కంటే రూ. 20 నుండి 30 అదనంగా తీసుకుని కోట్లల్లో లాభాలార్జిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు మండల కేంద్రంలోని వైన్ షాపులలో అన్ని రకాల బ్రాండ్లను పెట్టి ఎమ్మార్పీ ధరలకే విక్రయించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ప్రధాన ప్రతిపక్షాలను కలుపుకొని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

## రెండో రోజు సానిటేషన్ స్పెషల్ డ్రైవ్



**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో 4, 5, 28,29,30 డివిజన్లలో రెండవ రోజు శనివారం సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కొనసాగింది. గోదావరి పుష్కర ఘాట్ , గంగా నగర్ ఫ్లై ఓవర్ , భీమయ్య కాలనీ , పవర్ హౌస్ కాలనీ , పాముల పేట , హౌజింగ్ బోర్డు కాలనీ ,లింగాపూర్ , ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో వీధులు ఊడ్చి శుభ్రం చేయడంతో పాటు మురుగు నీటి కాలువల్లో పూడిక తీసి తరలించారు. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) . రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ , డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం , సంపత్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ , సి ఓ లు ఊర్మిళ , శ్వేత , ఎకో వారియర్స్ ప్రతినిధి మహేందర్ , ఆర్ పి లు పాల్గొన్నారు. ఆదివారం 1, 6, 7, 8, 24, 31 డివిజన్లలో ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుంది. అని తెలిపారు.

## సత్తుపల్లిలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

- సీపీఎం ఆధ్వర్యంలో ఘన నివాళులు
- సామాజిక విప్లవ కారిణికి స్మరణ
- కులవ్యవస్థ, పితృస్వామ్యానికి వ్యతిరేక పోరాటానికి ప్రశంస
- తొలి ఉపాధ్యాయినిగా చరిత్రలో చిరస్మరణీయ స్థానం
- గ్రామగ్రామాన పూలే ఆశయాల ప్రచారానికి పిలుపు




**సత్తుపల్లి ,విశాలభారతి:** సీపీఎం సత్తుపల్లి రూరల్ కమిటీ ఆధ్వర్యంలో సత్తుపల్లిలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం సావిత్రిబాయి పూలే 195వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాజిరి జ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే సామాజిక విప్లవ కారిణిగా కులవ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. శూద్రులు, అస్పృశ్యులు, మహిళల సకల హక్కుల కోసం జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహోన్నత వ్యక్తిత్వమని అన్నారు. భారతదేశ తొలి ఉపాధ్యాయినిగా చరిత్రలో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్న గొప్ప మహిళ, రచయిత్రి సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే భారతీయ సంఘసంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి అని తెలిపారు. నిన్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే కాకుండా, స్వతంత్ర ఆలోచనలతో సమాజ మార్పుకు కృషి చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారని అన్నారు. కుల, మత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణిగా, ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మిన మహనీయురాలిగా సావిత్రిబాయి పూలే నిలిచారని వివరించారు. ఆమె ఆశయాలను గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు అయినంపూడి సనంద రావు, కువ్వారపు లక్ష్మణ్ రావు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శి కొలి కపోగు సర్వేశ్వరరావు, ఐద్వా డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, మిట్టపల్లి నాగమణి, రజని తదితరులు పాల్గొన్నారు.

## యువ సేవా సమితి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

- డా. మట్టా దయానంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు బహుమతులు
- జూనియర్ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల విద్యార్థుల పాల్గొనడం
- ప్రతిభకు గుర్తింపుగా బహుమతుల ప్రదానం.. విద్యార్థులకు ప్రోత్సాహక సందేశం



**సత్తుపల్లి, విశాలభారతి:** సత్తుపల్లి పట్టణంలో యువ సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయకుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని జూనియర్ ప్రభుత్వ మరియు ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీవాణి కాలేజీకి చెందిన కే. జస్వంతి ప్రథమ బహుమతి సాధించారు. అదే కళాశాల విద్యార్థిని డి. నర్మద ద్వితీయ బహుమతి పొందారు. గర్ల్స్ జూనియర్ కాలేజీకి చెందిన ఉమ్మశ్రీ కూడా ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. విజేతలకు సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విజేతలందరికీ అభినందనలు తెలియజేస్తూ, విద్యార్థులంతా భవిష్యత్తులో మంచి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యువ సేవా సమితి ఫౌండర్ జొన్నలగడ్డ రాజు, కిన్నెర మణి, దుగ్గిరాల పార్టీ నరేష్ కుమార్ నాయుడు, యర్రగొర్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యుగంధర్‌కు సన్మానం

- ఆటో కార్మికుల కష్టసుఖాలు తనకు తెలుసు
- సమస్యలో ఉన్నవారికి 24 గంటల అందుబాటు హామీ
- యూనియన్ సమస్యల పరిష్కారంలో నిరంతర సహకారం



**అశ్వారావుపేట, విశాలభారతి :** దమ్మపేట మండల కేంద్రంలో ఆటో కార్మికుల పట్ల నిలకడగా అండగా నిలుస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందిన మాజీ ఉప సర్పంచ్ దారా యుగంధర్‌కు స్థానిక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ ప్రెసిడెంట్ సంకు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆటో కార్మికుల సమస్యలపై ఆయన చూపిన చొరవను గుర్తించి దారా యుగంధర్‌తో పాటు రామకృష్ణను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన దారా యుగంధర్ ప్రజల మధ్యే, ప్రజల కోసమే తాను ఎప్పుడూ ఉంటానని స్పష్టం చేశారు. ప్రజలకు ఎప్పుడూ చెరువులోనే ఉంటానని, ఎవరు సమస్యలో ఉన్నా సహాయం చేయడానికి తాను సిద్ధంగా ఉంటానని చెప్పారు. తన కార్యాలయ తలుపులు 24 గంటలు అందుబాటులో ఉంటాయని పేర్కొంటూ, ఆటో కార్మికులు ఎలాంటి భయాలు లేకుండా సమస్యలు తెలియజేయాలని ధైర్యం ఇచ్చారు. కార్మికుల కష్టసుఖాలు తనకు బాగా తెలుసని, సంఘటితంగా ఉన్నప్పుడే వారి హక్కులు పరిరక్షించబడతాయని అన్నారు. యూనియన్ బలోపేతానికి తన వంతు సహకారం నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం యూనియన్ ప్రెసిడెంట్ సంకు రమేష్ మాట్లాడుతూ ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న ఇంధన ధరల భారము, ట్రాఫిక్ జరిమానాలు, పార్కింగ్ సమస్యలు, రోడ్డు భద్రత వంటి అంశాలను ప్రస్తావించారు. ఈ సమస్యల పరిష్కారంలో దారా యుగంధర్ గతంలో చేసిన సహకారాన్ని గుర్తు చేస్తూ ఆయనకు యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆయన అండతో యూనియన్ మరింత బలోపేతం అవుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మౌలాలి, హరి, బాబురావు, శ్రీరామ్మూర్తి, శివతో పాటు ఆటో యూనియన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యే మహిళల నిజమైన ఆయుధం



**పాల్వంచ విశాల భారతి:** పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల లో సావిత్రిబాయి పూలే జయంతిని ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ మరియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ అధ్యక్షత వహించగా, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పద్మ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే మహిళా విద్యకు చేసిన సేవలను, సమాజంలో మహిళల హక్కులు, సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. మహిళల సాధికారత ద్వారా మాత్రమే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యే మహిళల శక్తికి మూలమని వారు పేర్కొన్నారు.సందర్భంగా ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ జె మాధవి మాట్లాడుతూ..మహిళా విద్య, స్వావలంబన, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలియజేశారు. చివరగా సావిత్రిబాయి పూలే ఆశయాలను ఆచరణలోకి తీసుకువెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మహిళా సాధికారతపై అవగాహన పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ టి అరుణ కుమారి శెట్టి స్వరూప రాణి డి రమేష్ డాక్టర్ వేముల కామేశ్వరరావు విజయ ప్రసాద్ పొట్లపు శ్రీనివాసరావు పారెల్లి శ్రీనివాస్ కోటగిరి రాంబాబు డాక్టర్ నియాజ్ పర్వీన్ డాక్టర్ ఎన్ శ్రీదేవి హారిక బాబ్జి పవన్ ఈ శ్రీను శివ మధు కమలాకర్ పవన్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల ఎదురుచూపులు



**విశాలభారతి, కరకగూడెం:** మండలంలోని సొసైటీ సబ్ సెంటర్ వద్ద శనివారం ఉదయం నుంచే యూరియా కోసం రైతులు బారులు తీరారు. యాసంగి సాగుకు ఎరువులు అత్యవసరమవడంతో, పనులన్నీ మానుకుని క్యూలో నిలబడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రబీ సీజన్‌లోనూ తీవ్ర ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతమవుతోందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

# విద్యార్థి దశ చాలా అందమైనది

- నాకు కూడా నిక్కరు వేసుకోవాలనిపిస్తోంది
- మానవజన్మకు సార్ధకత అవసరం
- డాక్టర్ కే నారాయణ



**చర్ల, విశాలభారతి:** విద్యార్థి దశ ఎంతో అందమైన మిమ్మల్ని అందరిని చూస్తుంటే నాకు కూడా నిక్కరు వేసుకోవాలననే కుతూహలం కలుగుతోందని సిపిఐ సీనియర్ నాయకులు, పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ అన్నారు. శనివారం చర్ల మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులుగా ఉండడం ఎంతో, ఈ విద్యార్థి దశలో నేర్చుకున్న పాఠాలు జీవితాలను మలుపు తిప్పుతాయని చెప్పారు. సమస్త జీవరాశులలో మానవ జన్మ ఎంతో పవిత్రమైనదని. అలాంటి ఈ మానవ జన్మకు సార్ధకత తీసుకురావాలన్నారు. సమ సమాజ స్థాపన కావలసిన జ్ఞానం తరగతి గదుల నుండే మొదలవుతుందని, తోటి వారికి తోడ్పాటు అందిస్తూ సమాజాన్ని తీర్చి దిద్దాలన్నారు. అంతా చక్కగా చదువుకొని ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు పేరు తేవాలని, జీవితాల్లో స్థిరపడి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మారుమూల ప్రాంతంలో విలువలతో కూడిన విద్యా ప్రమాణాలను నేర్పిస్తున్న డాక్టర్ డి ఎన్ కుమార్ ఆశయం తనను ఆకట్టుకుందని, ఈ ఆశయం రాబోయే రోజుల్లో మరింత గొప్పగా చిగురించాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కేషాబీర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసిన దోసపాటి

- నూతన సంవత్సర జ్ఞాపిక అందజేత




**అశ్వాపురం, విశాలభారతి :** భద్రాచలం ఏఎస్పీ శ్రీ విక్రాంత్ కుమార్ సింగ్ ను అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన ఎస్ కే టి గ్రూప్స్ సంస్థల అధినేత దోసపాటి పిచ్చేశ్వర రావు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. తొలుత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన ఎస్ కే టి గ్రూప్ సంస్థల జ్ఞాపికను అందజేశారు. ఏఎస్పీని కలిసిన వారిలో న్యాయవాది గురు కృష్ణ ఉన్నారు.

# ఓపెన్ జిమ్‌ను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఉషోదయ కాలనీలో ఉన్న పార్క్, ఓపెన్ జిమ్‌ను హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్‌లోని సౌకర్యాలు, పరికరాల స్థితిని ఆయన పరిశీలించి, అవసరమైన అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలోని పార్క్, ఓపెన్ జిమ్‌ను పిల్లలు, యువత, మహిళలు, వృద్ధులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజువారీ వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.అలాగే పార్క్, ఓపెన్ జిమ్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అక్కడ ఉన్న పరికరాలను జాగ్రత్తగా వినియోగించుకోవాలని కాలనీవాసులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరసింహారెడ్డి, బీజేపీ నాయకులు ఎర్ర శ్రీకాంత్, శానిటేషన్ సూపర్వైజర్ నగేష్ యాదవ్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి జయంతి



**సికింద్రాబాద్, విశాలభారతి:** సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నాయకులు నివాళులు అర్పించారు. సమాజంలో అసమాన తలపై అలుపెరుగని పోరాటం చేసిన మహిళ సావిత్రిబాయి పూలే హక్కుల కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే ఈరోజు భారతదేశ తొలి విద్యావేత్త సావిత్రిబాయి పూలే ఆరోజు మహిళలకు విద్యను బోధించి విద్యావంతులను చేసిన మహిళ ఈరోజు భారత దేశంలో మహిళలు ఒక రాష్ట్రపతి కేంద్ర మంత్రులు, కలెక్టర్లు, ఐఎస్ ఆఫీసర్లు ఎదగడం సావిత్రిబాయి పూలే చేసిన కృషి సావిత్రిబాయి పూలే కు ఘన నివాళులర్పించారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- తెలిపిన చిలుక మధుసూదన్ రెడ్డి



విశాలభారతి , అబ్దుల్లాపూర్ మెట్ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రథసారథి, శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరులు ఎనుముల తిరుపతి రెడ్డి, ఎనుముల కృష్ణ రెడ్డిను కూడా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రజల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# పీకే ఓసి డీప్ సైడ్ విస్తరణ గని సింగరేణికే కేటాయించాలి

- పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, విశాలభారతి:** మణుగూరు ఏరియా పీకే ఓసి డీప్ సైడ్ విస్తరణ గనిని సింగరేణి సంస్థకే కేటాయించి మణుగూరు ప్రాంత మనుగడను కాపాడాలని కోరుతూ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ను శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పీకే ఓసి డీప్ సైడ్ గనిని సింగరేణి సంస్థకు కేటాయించకపోతే మణుగూరు ప్రాంతం తీవ్ర ఆర్థికసామాజిక సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. మిగిలిన గనులు క్రమంగా మూతపడటం, మణుగూరు ప్రాంత అభివృద్ధి పూర్తిగా నిలిచిపోవడం, సింగరేణి శాశ్వత ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరిగా జరగడం, ఇతర ప్రాంతాల గనులు కూడా ప్రభావితమవడం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. అదేవిధంగా శాశ్వత ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోవడం, గనుల విభాగంలో ఉపాధి అవకాశాలు పూర్తిగా కోల్పోవడం, దాదాపు వెయ్యిమంది కాంట్రాక్ట్ కార్మికులు, పదిహేను మంది ఓబీ కార్మికులు ఉపాధిని కోల్పోవడం వంటి పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు. బొగ్గు రవాణా వ్యవస్థ దెబ్బతిని లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్ షెడ్లు తీవ్రంగా నష్టపోతాయని, అనేక కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు, ఇళ్ల ధరలు పడిపోవడంతో పాటు పరోక్ష ఉపాధి కూడా తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు.

ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, పీకే ఓసి డీప్ సైడ్ విస్తరణ గనిని తెలంగాణ జెన్‌కోకు కాకుండా కేవలం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రిని కోరారు. దీనిపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం సింగరేణి భవన్‌లో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి. కృష్ణ భాస్కర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు యస్.డి. నాసర్ పాషా పాల్గొని, మణుగూరు మనుగడ కోసం ఎమ్మెల్యే చేస్తున్న కృషిని అభినందించారు. ప్రభుత్వం స్పందించి పీకే ఓసి డీప్ సైడ్ విస్తరణ గనిని సింగరేణికే కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. మణుగూరు ప్రాంత భవిష్యత్తును కాపాడే దిశగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆశాభావం వ్యక్తం చేశారు.



# సాగులో ఉన్న పోడు భూములన్నిటికీ పట్టాలు ఇవ్వాలి



- ఫారెస్ట్ అధికారులు పోడు భూములు స్వాధీనం చేసుకోవడాన్ని ఆపాలి
- 6 న భద్రాచలంలో ర్యాలీ, ఐటీడీఏ ముందు ధర్నాను విజయవంతం చేయండి
- తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రసాదన్న

**పాల్వంచ, విశాలభారతి:** ఏజెన్సీలో ఆదివాసుల సాగులో ఉన్న పోడు భూములన్నిటికీ పట్టాలు ఇవ్వాలని, ఫారెస్ట్ అధికారులు ఆదివాసుల పోడు భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడాన్ని వెంటనే నిలిపివేయాలని తెలంగాణ రైతు కూలీ సంఘం (ఏఐకేఎంకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు ప్రసాదన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పాల్వంచ పట్టణంలోని తెలంగాణ రైతు కూలీ సంఘం (ఏఐకేఎంకేఎస్) జిల్లా కార్యాలయంలో బండ్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ప్రసాదన్న పాల్గొని మాట్లాడారు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలిస్తామని ఎన్నికల్లో హామీ హామీ ఇచ్చిన పాలకులు ఏరు దాటినంక తెప్ప తగలేసినట్టు పట్టాలు ఇవ్వకుండా ఆదివాసులను ఇక్కట్లకు గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాల ద్వంద్వ విధానాలతో ఫారెస్ట్ అధికారులు దఫ దఫాలుగా పోడు భూములను స్వాధీనం చేసుకుంటుంటే ఆదివాసులు తమ జీవనాధారమైన భూమిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 5వ షెడ్యూలు ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసి ప్రజలను దేశవ్యాప్తంగా 1952 రాష్ట్రపతి గెజిట్ ప్రకారం షెడ్యూల్ ట్రైబల్‌లుగా గుర్తించారని, భారత షెడ్యూల్ చట్టాల ప్రకారం చతిస్గఢ్ అయిన, ఒరిస్సా అయినా, ఆంధ్రప్రదేశ్ అయినా, తెలంగాణ అయినా ఆదివాసీ తెగలను షెడ్యూల్ ట్రైబల్ గానే గుర్తించాలని, చతిస్గడ్ ప్రాంతం నుండి తెలంగాణకు వచ్చి రెండు దశాబ్దాలకు పైగా నివసిస్తున్న ఆదివాసులను షెడ్యూల్ ట్రైబల్ గా గుర్తించి వారి సమస్యలు పరిష్కరించాలని, ఏజెన్సీలో ఆదివాసుల ఓట్లతో గెలిచిన ప్రజా ప్రతినిధులు వారు ఇచ్చిన హామీ మేరకు పోడు భూముల పట్టాల సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో చొరవ చూపాలని, ఫారెస్ట్ అధికారులు పోడు భూముల జోలికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని అన్నారు.

ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏజెన్సీలో ఆదివాసుల సాగులో ఉన్న పోడు భూములను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకోవడాన్ని నిలిపివేసి, ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని, 1/70 చట్టం, 1996 షెడ్యూల్ ఏరియా పంచాయతీరాజ్ చట్టం (పెస చట్టం), 1997 సుప్రీంకోర్టు సమత జడ్జిమెంట్ తదితర షెడ్యూల్ చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఈనెల 6వ తారీఖున భద్రాచలంలో ర్యాలీ, ఐటీడీఏ పీవో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ పోడు సాగుదారులకు, ప్రజాస్వామిక వాదులకు తెలంగాణ రైతు కూలీ సంఘం (ఏఐకేఎంకేఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ పిలుపునిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం (ఏఐకేఎంకేఎస్) రాష్ట్ర నాయకులు మోర రవి, జిల్లా నాయకులు సూరేపల్లి వెంకటేశ్వర్లు, శర్ప నారాయణ, కుంజ వెంకటేశ్వర్లు, ఊకం పాపారావు, మడివి సోమయ్య, రెంటాల నారాయణ, రాజు, గంగయ్య, మమత, సోమక్క, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ అవార్డుకు అర్హత సాధించిన శ్రీనివాస్ రావు

- కృత్రిమ మేధస్సు ఆధారంగా నిఫ్టీ–50 ధరల అంచనాలపై పరిశోధన
- వివరణాత్మక కృత్రిమ మేధస్సు విధానంతో నిఫ్టీ–50 ధరల మార్పులపై పరిశోధన
- భువనేశ్వర్ సాంకేతిక సంస్థ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైవా పరీక్షలో ఉత్తీర్ణత
- గ్రామీణ నేపథ్యం నుంచి జాతీయ స్థాయి పరిశోధకుడిగా ఎదిగి యువతకు స్ఫూర్తిగా నిలిచిన విజయం

**అశ్వారావుపేట, విశాలభారతి:** గ్రామీణ నేపథ్యం నుంచి విశ్వవిద్యాలయ స్థాయికి ఎదిగి పరిశోధన రంగంలో విశిష్ట గుర్తింపును సాధించారు శ్రీనివాస్ రావు చీకటి. నిఫ్టీ-50 సూచీలో ధరల మార్పులను అంచనా వేయడానికి వివరణాత్మక కృత్రిమ మేధస్సును వినియోగించే కొత్త విధానంపై నిర్వహించిన వైవా పరీక్షలో ఆయన ఉత్తీర్ణత సాధించి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీకి అర్హత పొందారు. అనురాగ్ విశ్వవిద్యాలయంలో పరిశోధన విద్యార్థిగా ఉన్న శ్రీనివాస్ రావు చీకటి, విశ్వవిద్యాలయ అకాడమిక్ అండ్ ప్లానింగ్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె. సుధీర్ రెడ్డి పర్యవేక్షణలో తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. గత నెల 29న భువనేశ్వర్ సాంకేతిక సంస్థకు చెందిన ప్రఖ్యాత ప్రొఫెసర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైవా వోస్ పరీక్షలో ఆయన ప్రతిభను చాటుకుని ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష ప్యానెల్ సభ్యుల సిఫారసుల మేరకు శ్రీనివాస్ రావు చీకటికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని ప్రదానం చేయనున్నట్లు పర్యవేక్షకులు వెల్లడించారు. పరిశోధనలో ఆయన చూపిన అవగాహన, విశ్లేషణా సామర్థ్యం ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. సాధారణ కుటుంబ నేపథ్యంతో, విద్యకు పరిమిత వనరులే ఉన్న గ్రామీణ ప్రాంతంలో పెరిగిన శ్రీనివాస్ రావు కష్టపడి చదివి ఉన్నత విద్యలో రాణించడం ఆ గ్రామ యువతకు స్ఫూర్తిగా నిలిచింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు వంటి అత్యాధునిక అంశాలను పరిశోధనలో సమర్థంగా వినియోగించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం విశేషమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తన ఈ విజయానికి తల్లిదండ్రుల త్యాగం, గురువుల మార్గదర్శకత్వం, పర్యవేక్షకుల సహకారం ప్రధాన కారణాలుగా నిలిచాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు అవకాశాల లేమితో నిరుత్సాహ పడకుండా పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఆయన అన్నారు. తన పరిశోధన భవిష్యత్తులో ఆర్థిక రంగ అభివృద్ధికి ఉపయోగపడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



# మంచిరెడ్డి కిషన్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్టు :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, రంగారెడ్డి జిల్లా టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని బాట సింగారం రైతు సహకార సంఘం మాజీ చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన సంవత్సరంలో పార్టీ మరింత బలోపేతం కావాలని, ప్రజల సంక్షేమం కోసం అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ సందర్భంగా బాట సింగారం రైతు సేవ సహకార సంఘం మాజీ చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి , అబ్దుల్లాపూర్ మెట్టు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్త కిషన్ , మండల మాజీ అధ్యక్షుడు పూజా చక్రవర్తి , మండల ఉపాధ్యక్షులు మండల్ చారి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే జీవితం




**సికింద్రాబాద్, విశాలభారతి:** సావిత్రిబాయి పూలే 195వ జన్మదినాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్లో ఓబీసీ మోర్చా రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళ ఉపాధ్యాయురాలు కృష్ణప్రియ పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన మహిళా ఉపాధ్యాయురాలు కృష్ణప్రియ మాట్లాడుతూ.. 1931లో మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జనవరి 3న జన్మించిన సావిత్రిబాయి తొమ్మిదేళ్ల వయసులోనే జ్యోతిరావు పూలేతో బాల్య వివాహం జరిగిన సమయంలో సావిత్రిబాయికి అక్షరజ్ఞానం లేదని సావిత్రిబాయికి చదువు పట్ల ఆసక్తిని గమనించిన భర్త జ్యోతిరావు పూలే స్వయంగా విద్యను అభ్యసింపజేసి ఉపాధ్యాయ శిక్షణ ఇప్పించి భారతదేశంలోని మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే జీవితం యావత్ మహిళా లోకానికి ఆదర్శమని కృష్ణప్రియ ఓబీసీ మోర్చా రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి కొనియాడారు. ఆ కాలంలోనే కుల వివక్ష సతి సహగమనం బాల్య వివాహల నిర్మూలన కోసం పోరాడిన వీర వనిత అని అంతే కాకుండా సాహిత్యంలో ప్రజాసేవలో స్త్రీల హక్కుల కోసం పోరాడి భారతీయ స్త్రీవాద పితామహురాలిగా చరిత్ర పుటల్లోకి ఎక్కిందని అన్నారు. మహిళల పట్ల కొనసాగుతున్న వివక్ష నిర్మూలన కేవలం విద్యతోనే సాధ్యమని మహారాష్ట్రలోని పూణేలో మహిళల కోసం సొంత ఖర్చులతో 50 కి పైగా పాఠశాలలు నిర్మించి మహిళలకు విద్యాభ్యాసం అందించి సావిత్రిబాయి పూలే స్వయంగా విద్యాబోధన చేసిందని అన్నారు.మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షకు వ్యతిరేకంగా పోరాడి సమాజంలో స్త్రీలు పురుషులు అన్ని కులాల వారు సమానమే అనే స్ఫూర్తితో మహిళల పక్షాన పోరాడి మహిళలు ఏ రంగంలోనూ తీసి పోరని నిరూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, ధన సౌజన్య,శ్రీజ,పార్వతి, జ్యోతి,వాణి తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులుగా రావుల కృష్ణ

- రాష్ట్ర కార్యదర్శిగా మాచర్ల రాంబాబు




**రాజేంద్రనగర్, విశాలభారతి:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలు శంషాబాద్ నగరంలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నూతన అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా త్రిపుర గవర్నర్ నల్ల ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు. యువత దేశ అభివృద్ధిలో దూసుకెళ్లాలని అన్ని రంగాల్లో యువత రాణించాలని చదువుతోపాటు జ్ఞాన మందించే క్రమశిక్షణ కలిగిన సమస్త ఏదైనా ఉందంటే అది కేవలం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత సంఘటన మంత్రి ఆశిష్ చౌహాన్ జి, దక్షిణ క్షేత్ర సంఘటన మంత్రి చెరిగే శివకుమార్ జి, ప్రాంత సంఘటన మంత్రి విష్ణువర్ధన్ జి, గ్రేటర్ హైదరాబాద్ సంఘటన మంత్రి రాజశేఖర్ జి, శంషాబాద్ విభాగ్ సంఘటన మంత్రి మల్లికార్జున్ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాష్, జిల్లా కన్వీనర్ పవన్ జగదీష్, నగర కార్యదర్శి భరత్ విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు,

# ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శనివారం రోజు పద్మావతి కాలనీలో పర్యటించి, అక్కడ మిగిలి ఉన్న అభివృద్ధి పనుల వివరాలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలపై స్థానికులతో చర్చించి, వారి సమస్యలను నేరుగా వినడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి పనుల విషయంలో కార్పొరేటర్ ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలోని ఒక వీధిలో భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ సదుపాయం లేకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, సమస్యను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అమర్నాథ్ గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు భూపాల్ రెడ్డి, చంద్రశేఖర్, బీజేపీ నాయకుడు ఎర్ర శ్రీకాంత్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు

# హయత్‌నగర్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ మండల కేంద్రంలో పారంద స్వామి ఎర్ర రవీందర్ గార్ల ఆధ్వర్యంలో చదువుల తల్లి, క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే 191వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నాయకులు మాట్లాడుతూ.. మహారాష్ట్ర రాష్ట్రంలోని సతారా జిల్లాలో 1831 జనవరి 3న జన్మించిన సావిత్రిబాయి పూలే చిన్నతనం నుంచే కుల అసమానతలతో అనేక అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ, "చదువే ఆయుధం" అనే నమ్మకంతో తన భర్త జ్యోతిరావు పూలే సహకారంతో విద్యను అభ్యసించి, ఆ విద్యను మహిళల అభ్యున్నతికి అంకితం చేశారని కొనియాడారు. స్త్రీలు నాలుగు గోడల మధ్య ఒంటింటికే పరిమితం కాకుండా చదువుకుంటేనే సమాజం బాగుపడుతుందన్న దృఢ నమ్మకంతో 1848లో దేశంలోనే తొలి మహిళా పాఠశాలను ప్రారంభించి స్త్రీ విద్యకు బాటలు వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని వారు గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు సోమిడి శేఖర్ రెడ్డి, సుక్క బాబా యాదవ్, బీసీ సంఘం నాయకులు ఎత్తరి భీమ్ రాజు, నరసింహ కురుమ, బర్రె రాజ్ కుమార్, మహిళా నాయకురాలు పార్వతమ్మతో పాటు అనేక మంది మహిళలు పాల్గొన్నారు.



# మూసీ తీరం..?
## 'రియల్టీ' సజీవం కానుందా?
## హైదరాబాద్ రియల్టీకి కొత్త ఊపు

**మూసీ తీరం ఇక చెత్త కుప్పల కాదు, అందమైన ల్యాండ్‌స్కేప్ కారిడార్‌గా మారబోతోంది. తెలంగాణ ప్రభుత్వ "మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్" ప్రాజెక్ట్ దిశగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే, గత దశాబ్దాల్లో నిర్లక్ష్యానికి గురైన ఓల్డ్, ఈస్ట్ హైదరాబాద్ మళ్లీ అభివృద్ధి పథంలో ముందుకు రావచ్చని నగరాభివృద్ధి నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. 55 కిలోమీటర్ల విస్తీర్ణంలో మహత్తర యత్నం గండిపేట్ నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల మూసీ నది తీరం ప్రభుత్వ ప్రణాళికలో చేరింది. ఈ ప్రాజెక్టులో ఎలివేటెడ్ కారిడార్, గ్రీన్, బ్లూ జోన్లు, సైక్లింగ్ ట్రాక్స్, పర్యాటక కేంద్రాలు, నది పక్కన మిక్స్‌డ్-యూజ్ రియల్ ఎస్టేట్ జోన్లకు అవకాశం ఉండేలా ముసాయిదా ప్రణాళిక ఉంటుందని అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి తర్వాత ఫేజ్-1 స్పష్టతమూసీ రివర్‌ఫ్రంట్ ఫేజ్-I కి సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సంక్రాంతి తర్వాత పూర్తి అవుతుందని, మార్చి 31 లోపు అంచనా వ్యయం, టెండర్ల షెడ్యూల్ ఖరారు చేయనున్నట్లు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వర్గాలు పేర్కొన్నాయి.**

***- హైదరాబాద్, విశాలాభారతి***

"ప్రపంచ నగరాలకు సాటిగా హైదరాబాద్ రూపుదిద్దుకోవాల్సిన సమయం ఇది. మూసీ తిరిగొస్తే, నగర జీవనం కూడా నూతన ఊపందుకుంటుంది" అని ఒక ఉన్నత అధికారులు తెలిపారు. పరిసరాల పునరుద్ధరణే ప్రధాన అంశంతో మూసీ ప్రాజెక్టు కేవలం రియల్ ఎస్టేట్ స్కీమ్ అన్న పుకార్లకు తెర పడింది. ఇది ప్రధానంగా ఈకోరిస్టోరేషన్, అర్బన్ రీబ్రాండింగ్ యత్నమని చెబుతున్నారు. నది శుద్ధి, పర్యావరణ హిత వృక్షావనం, వర్షపు నీరు సేకరణ, శానిటేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటి అంశాలు దీనిలో భాగం. తెలంగాణ పట్టణాభివృద్ధి విభాగం అధికారి ఒకరు తెలిపారు. "హైదరాబాద్‌లో మూసీ ప్రవాహాన్ని పునరుద్ధరించి, తీరాన్ని పర్యాటక, వినోద ప్రదేశాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం. ఇది నగర చిహ్నాతను పెంచుతుంది. "రియల్ ఎస్టేట్ దృక్కోణంలో కొత్త దశ మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం మూసీ కారిడార్‌లో గల పాత నగర, ఈస్ట్ బెల్ట్ ప్రాంతాలు మార్కెట్‌లో 10-15 శాతం తక్కువ విలువ కలిగి ఉన్నాయి. కాలుష్యం, వరద ప్రమాదం, పాత ఇన్ఫ్రాస్ట్రక్చర్ కారణాలు కాగా, మూసీ అభివృద్ధి విజయవంతమైతే, ఈ స్థాయికి ఉన్న డిస్కౌంట్ తగ్గుతూ వచ్చే ఐదుఏళ్లలో సబర్మతి రివర్‌ఫ్రంట్ లాగా 30-50 శాతం విలువ పెరిగే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ ఎక్సపర్టులు అంచనా వేస్తున్నారు. "చాదర్‌ఘాట్, మలక్‌పేట్, మూసారాంబాగ్‌లు మల్టీస్టోరీ రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్‌కి చేరువైన ప్రాంతాలు. రివర్‌ఫ్రంట్ రూపుదిద్దుకుంటే వీటి విలువలో గణనీయంగా పెరుగుతోంది. హిమాయత్‌సాగర్‌బుద్వేల్‌కిస్మత్‌పూర్ ఇప్పటికే కొత్త టౌన్‌షిప్‌లకు అడుగులు వేస్తోంది. "ప్రభుత్వ భూములు-ప్రైవేట్ సంస్థల ఆసక్తి ప్రభుత్వం ఇప్పటివరకు 734 ఎకరాలకు పైగా భూమిని హిమాయత్‌సాగర్-బుద్వేల్-కొత్వాల్ గూడ పరిసరాల్లో మూసీకి బదిలీ చేసింది. ఇవి భవిష్యత్తులో మిక్స్‌డ్ యూజ్ ప్రాజెక్టులుగా ఉపయోగించే అవకాశం ఉంది. అదే కనుక జరిగితే అంతర్జాతీయ డెవలపర్లు ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపుతారు. ఇప్పటికే ప్రభుత్వ వర్గాల ప్రకారం కొన్ని గ్లోబల్ కంపెనీలు, ముఖ్యంగా ఎమ్మార్ వంటి డెవలపర్లు తమ ప్రతిపాదనలు అధికారికంగా సమర్పించడానికి సిద్ధమవుతున్నాయట.

**మూసీ కారిడార్ — కొత్త గ్రోత్ జోన్**

ఇప్పటికే మూసీ కారిడార్‌ను "అతిపెద్ద గ్రోత్కారిడార్గా"గా ప్రచారం జరుగుతుంది. కొందరి అంచనా ప్రకారం ఉగాది తరువాత ఫేజ్ 1 పనులు ప్రారంభం కానుండగా, వీటితో ఇన్ఫ్రాస్ట్రక్చర్, గవర్నమెంట్ ఆక్షన్‌లు, అర్బన్ యాక్టివిటీలు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కానీ సామాజిక, పర్యావరణ కార్యకర్తల నుంచి వ్యతిరేకత, ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. మరో వైపు సామాజిక సంస్థలు ఈ ప్రాజెక్టుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. పెద్ద ప్రాజెక్టలతో పాటు పునరావాసం, భూ సేకరణ, కాలుష్య నియంత్రణ సమస్యలపై స్పష్టత లేదనీ వాదిస్తున్నాయి. "ప్రాజెక్టు పేరు మీద పాత నగర ప్రజలు బదిలీ అవ్వకూడదు, మొదట నది శుద్ధి, తర్వాత నిర్మాణం జరగాలి" అని మూసీ పరిరక్షణ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు.

**కాల పరిమితితో అభివృద్ధి పనులు...**

సుదీర్ఘ ప్రణాళికపై నగరాభివృద్ధి నిపుణుల అంచనా ప్రకారం, 2025 నుంచి 2030 మధ్య కాలంలోనే ప్రధాన ఫేజ్‌లు పూర్తికావచ్చని భావిస్తున్నారు. DPR, ఫండింగ్, లిటిగేషన్, రాబోయే ఎంపాల్మెంట్ డిలేలు టైమ్‌లైన్‌ను ప్రభావితం చేయవచ్చని చెబుతున్నారు. ప్రాజెక్టు వేగంగా సాగినా, నాణ్యతకు కట్టుబడి ఉండాలని. ఇన్వెస్టర్లకు వ్యూహాత్మక సూచనలు కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు మూసీ పేరుతో అప్పటికే ప్లాట్లు మార్కెట్లోకి తెస్తున్నాయి.

**హైదరాబాద్‌కి సబర్మతిలా**

గత రెండు దశాబ్దాలుగా దేశంలోని అహ్మదాబాద్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్ నగర రూపురేఖలు మార్చిన ప్రాజెక్ట్‌గా నిలిచింది. మూసీ రివర్‌ఫ్రంట్ కూడా తెలంగాణ ప్రభుత్వానికి అలాంటి ప్రతిష్టాత్మక అవకాశమే. కానీ దీనిని సాధ్యంగా చేయాలంటే ఓపిక, చిత్తశుద్ధి, నిధుల లభ్యత, రాజకీయ, సామాజిక సమన్వయం, స్థిరమైన పెట్టుబడులు అవసరం అని నిపుణులు చెబుతున్నారు. లేదంటే హైదరాబాద్ నగరానికి, ముఖ్యంగా తెలంగాణ ఆర్థిక వనరులను నిర్వీర్యం చేసే ప్రాజెక్టుగా నిలుస్తుందని, రాష్ట్రానికి ఇదొక గుదిబండగా మారబోతుందని హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి మూసీ రివర్‌ఫ్రంట్ అనేది కేవలం ఒక ప్రాజెక్టు కాదు. పట్టణ పునరుత్థానం యొక్క సూచకం. ఇది సాధ్యమైతే ఈస్ట్, ఓల్డ్ సిటీ బెల్ట్ మరోసారి నగర హృదయంగా మారుతుంది.

**నిపుణుల హెచ్చరిక**

ముందుచూపు లేకుండా "మూసీ ప్రాజెక్టు వస్తుంది" అనే ప్రచారంతో కొనుగోలు ప్రమాదకరమనీ నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ నిపుణుల ప్రకారం, బఫర్ జోన్ దాటిన ప్రాంతంలోని అన్ని అనుమతులు, క్లియర్ టైటిల్స్ ఉన్న భూములు మాత్రమే భద్రమైన పెట్టుబడి" అని సూచిస్తున్నారు. దీర్ఘకాలికంగా చూసే పెట్టుబడిదారులకు, మధ్యతరగతి రెసిడెన్షియల్, మిక్స్‌డ్ యూజ్ యూనిట్లు సమర్థమైన ఎంపికగా కనిపిస్తున్నాయి.

### సవాళ్లెన్నో...

ప్రాజెక్టు సక్సెస్ అయితే అధిక రిటర్న్స్ సాధ్యం, అదే విఫలమైతే కూడా ప్రైస్ సపోర్ట్ విషయంలో జాగ్రత్త అవసరం. మూసీ ప్రక్షాళన జరిగితే నిర్మాణ రంగం అభివృద్ధి చెంది, ఇతర రంగాలు, వ్యాపారం కూడా పెరుగుతుంది. ముందుగా చెత్త వాసన పోయాలి. ఆ తర్వాతే సుందరీకరణ పనులకు అనువుగా ఉంటుంది. ఈ ప్రాజెక్టును ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తే పాత నగరానికి చారిత్రకమైన మలుపుగా మారుతోంది. మూసీ శుద్ధి జరిగితే పరిహావక ప్రాంతాల్లో ప్రాపర్టీ విలువలు రెట్టింపవుతాయి. కానీ సవాళ్లు ఇంకా చాలా ఉన్నాయి. నది శుద్ధీకరణ, స్టార్మ్ వాటర్ డ్రెయినేజ్, వరద నియంత్రణ లేకుండా "రివర్‌ఫ్రంట్ విలువ" సాధ్యమేనా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే పలు పర్యావరణ సంస్థలు, మూసీ పరిసరాలు కాలుష్య కాసారాలుగా మారాయని అధ్యయనాలు తెలిపాయి. మూసీ సిస్టమ్ శుద్ధి అవ్వకపోతే విలువ తిరిగి రావడం కష్టమే. కాబట్టి ప్రాజెక్టు ఇంజనీరింగ్, ఎకోలాజికల్ భాగం ఒకేసారి నడవాలనే దానిపై దృష్టి పెట్టాలి.



# గొప్ప సాంఘిక సంఘ సంస్కర్త సావిత్రీ బాయి పూలే

**తెలంగాణ బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో వేడుకలు**



**పాల్వంచ విశాలభారతి:** కుల వ్యవస్థ, అంటరానితనం, బానిసత్వం, అవిద్య, మూఢ నమ్మకాలు వేళ్లూరూక పోయిన ఆ కాలంలో వాటన్నింటిని జయించి మహిళా సాధికారతను సాధించిన గొప్ప సాంఘిక సంఘ సంస్కర్త సావిత్రీ బాయి పూలే, గారి భాటలో పాతీమా షేక్ నడిచారని వక్తలు కొనియాడారు. ఆమే జయంతి సందర్భంగా శనివారం దమ్మపేట సెంటర్ లోని కార్యాలంలో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో జయంతి ఉత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆమే చిత్ర పటానికి పూల మాలలవేసి నివాళులు అర్పిఃచారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉన్నత వర్గాలకే విద్య అందే కాలంలో బహుజనులకు విద్యతోనే అభివ్రుద్ధి సాధ్యమని భావించి దేశంలోనె మొట్టమొదటిగా మహిళలలకు, బహుజనులకు పాఠశాలలను ప్రారంభించి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి పాఠాలు బోధించి సమాజంలో మార్పు తెచ్చిన గొప్ప మహిళా ఉపాధ్యాయురాలని గుర్తు చేసారు. మహాత్మా జ్యోతి రావ్ పూలే, సావిత్రి బాయి పూలేలు సమాజంలోని దురాచారాలను రూపుమాపి నవ శకానికి నాంది పలికారని అన్నారు. సమాజానికి విద్యతో పాటు సామాజిక సేవలు అందించారు. ప్లేగు వ్యాధి ప్రభలంగా సోకి వేలాది మంది మరణ వాత పడుతుంటే అంటు వ్యాధి అని తెలిసి కూడా వ్యాధి గ్రస్తులకు సేవ చేస్తూ మరణించి దన్నారు.ఆమే విద్యకు చేసిన సేవలు, భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలి జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకొనుటకు ప్రభుత్వం ప్రకటించడం ఆమే కు లభించిన గొప్ప గుర్తింపుగా భావించవచ్చని అభిప్రాయ పడ్డారు.వీరిని ఆదర్శంగా తీసుకొని దేశంలో ఎంతోమంది సంఘసంకర్తలు పుట్టుక వచ్చారని, దేశంలో అనేక మార్పుకు బీజం వేసిన వీరి జీవితాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో తెలంగాణా బహుజన ఐక్య వేదిక కన్వీనర్ బరగడి దేవదానం, అధ్యక్య, కార్యదర్శులు శ్రీపాద సత్యనారాయణ, శనగ రామచందర్ రావు,షేక్ నబీసాహెబ్, శనగ వెంకటేశ్వర్లు,చిటికెన ముసలయ్య,మంజూర్,గుర్రం లక్ష్మయ్య, మెంటం శ్రీను, మెంటం బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**అడవిదేవులపల్లి, విశాలభారతి:** అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని ముదిమాణిక్యం గ్రామం ప్రభుత్వ పాఠశాలలో మహనీయులు భారత దేశ మొదటి ప్రధానోపాధ్యాయురాలు గొప్ప మహిళ ఆణిముత్యం అయిన సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించటం జరిగినది. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామావత్ ఉమా మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు సావిత్రి బాయి పూలే గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహోపధ్యాయులు వై అనంత రెడ్డి మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్రిటికల్ పోలింగ్ కేంద్రాల పరిశీలించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**కొడంగల్, విశాలభారతి:** కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిటికల్ గా గుర్తించబడిన హస్నాబాద్ మరియు పర్సపూర్ గ్రామాలలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ఓటింగ్ ప్రక్రియ ను పర్యవేక్షించారు. అనంతరం, జిల్లా ఎస్పీ అక్కడే ఉన్న పోలింగ్ బూత్ లెవల్ అధికారులతో మరియు పరిగి డీఎస్పీతో మాట్లాడటం జరిగింది.

## స్త్రీ అభ్యుదయ వాది సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి



**నిజామాబాద్ , విశాలభారతి:** నిజామాబాద్ నగరంలోని అంబేద్కర్ కాలోని లో గల స్త్రీ అభ్యుదయ వాది, మహనీయ సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా AIPSU రాష్ట్ర అధ్యక్షులు బొడ. అనిల్, RSP నిజామాబాద్ కన్వీనర్ కటారి రాములు మాట్లాడుతూ, భారతదేశంలో మహిళా విద్యకు పునాదులు వేసిన మహానీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. బాలికల విద్య కోసం, మహిళల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. కుల వివక్ష, లింగ వివక్షలకు వ్యతిరేకంగా ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అనేక అవమానాలు నిందలు నిందలు భరించి సమాజంలో స్త్రీలు సైతం సమానంగా హక్కులను అనుభవించాలని శ్రీవిద్యను అందించిన మహనీయురాలు, నేటి యువతి, యువత సావిత్రిబాయి పూలే ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మహిళా విద్య, మహిళా భద్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో Ryf జిల్లా కన్వీనర్ పిట్ల నరేష్, AIPSU జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ సింగ్ ఠాగూర్, నాయకులు, సునిల్, ఆటో యూనియన్ నాయకులు హైమద్ , అబ్దుల్ ముజీబ్, సయ్యద్ రఫీ దిన్, సయ్యద్ ఇర్ఫాన్, మహమ్మద్ అయుబ్ పాల్గొన్నారు.

## వెదజల్లే పద్ధతిని పాటించి అధిక దిగుబడులు సాధించాలి

**లింగంపేట్ , విశాలభారతి:** ప్రతి రైతు డ్రం సీడర్ మరియు వెదజల్లే పద్ధతిని పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ విస్తీర్ణాధికారి రాకేష్ కుమార్ తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం బురుగిద్ద గ్రామాన్ని సందర్శించి, కొడురు ఆంథోని డ్రమ్ సీడ్ పద్ధతిలో వేసిన వరి పంటను మరియు వెదజల్లే పద్ధతిలో వేసిన వరి పంటను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యం మరియు నీటి యాజమాన్యం పై అవగాహన కల్పించామన్నారు. ఈ పద్ధతిలో సాగు చేయడం వలన కూలీల ఖర్చు తగ్గి, సాగు ఖర్చు తగ్గుతుంది. పంట కాల వ్యవధి తగ్గుతుంది. పెట్టుబడి ఆదా అవుతుంది దిగుబడి పెరుగుతుంది.ప్రతి రైతు డ్రంసీడర్ మరియు వెదజల్లే పద్ధతిని పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు

## రబి వరిసాగుకు సరిపడా యూరియ నిల్వలు



- **రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదు**
- **విలేకరుల సమావేశంలో ఏడిఏ బీ. తాతారావు**

**అశ్వాపురం, విశాలభారతి :**

రబీ వరి సాగుకు సరిపడా యూరియ నిల్వలు ఉన్నాయని, వరి సాగు చేస్తున్న రైతులు యూరియా కోసం అధైర్య పడాల్సిన అవసరం లేదని ఏడిఏ తాతారావు అన్నారు. శనివారం మండల కేంద్రం లోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మండలంలో 3535 ఎకరాలలో వరిసాగు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 1535 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేశారని ఇంకా రెండు వేల ఎకరాలలో వరిసాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రబి సాగుకు 2647 బస్తాల యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మండలంలో ఉన్న రెండు సొసైటీ కార్యాలయాలతో పాటు ప్రైవేటు ఎరువుల దుకాణాలలో కూడా యురియా దొరుకుతుందన్నారు. యూరియా అవసరమైన రైతులు పెస్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా బుక్ చేసుకోవాలన్నారు. ఇప్పటికే మెదక్, ఖమ్మం, వరంగల్, రాజన్న సిరిసిల్ల, నల్గొండ జిల్లాలలో యూరియా బుకింగ్ యాప్ లు వచ్చాయని, త్వరలో భద్రాద్రి జిల్లా కు కూడ అందజేస్తారన్నారు. ప్రతి ఎకరాకు రెండు బస్తాల చొప్పున యూరియా అందజేస్తారన్నారు. ఈ యూరియాను రైతులు ఎకరాకు 20 కేజీల చొప్పున నెలకు రెండు సార్లు చల్లుకుంటే పైరు ఆరోగ్యవంతంగా వస్తుందన్నారు. బుకింగ్ యాప్ అందుబాటులో లేని రైతులు సొసైటీ కేంద్రాలలోని సిబ్బందిని, స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే వారు బుక్ చేస్తారన్నారు. సొసైటీ కార్యాలయాల్లో కానీ, ప్రైవేటు ఎరువుల దుకాణాలలో యూరియాను ఎమ్మార్పీ ధర రూ. 266.50 లకే విక్రయిస్తారని ఆయన తెలిపారు. రవాణా చార్జీలు అదనమన్నారు. మార్చి నెల చివరి వరకు రైతులకు యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. ప్రైవేటు ఎరువుల దుకాణాలలో వ్యాపారులు ఎరువుల నిల్వ, ధరల పట్టికలను తప్పనిసరిగా చూపించాలన్నారు. లేని పక్షంలో ముందుగా వారికి షోకాస్ నోటీసులు అందజేసి సరైన సమాధానం రాకపోతే వారి షాపు ల లైసెన్సులు సైతం రద్దు చేస్తామన్నారు. అనంతరం రైతులకు ఏ డి ఏ చేతుల మీదుగా యూరియా బస్తాలను అందజేశారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ ఏఓ ఎన్ చటర్జి, ఏ ఈ ఓ డి. రమాదేవి, సీఈఓ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు సున్నం రాంబాబు, కాకా రాములు, రైతులు కిలారు శేషగిరి, కొంద్రు నరసమ్మ, భద్రయ్య సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

**పాల్వంచ, విశాలభారతి:** పొట్ట కుట్టి కోసం వలస వెళ్లిన ఆ కుటుంబానికి చేదు అనుభవం ఎదురయింది. ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు దొరక ఇల్లు కట్టడమే కష్టంగా మారిన ఆ కుటుంబం పని వెతుకుని వేరే ప్రాంతానికి వెళ్తే అక్కడ అనుకోని సంఘటన జరిగి ఇప్పుడు నాన్న ఇబ్బందులు పడుతున్నారు. పూట గడవడమే కష్టంగా మారిన ఆ కుటుంబం పై తమ కుమార్తె ఆసుపత్రి ఖర్చులకు డబ్బులు లేక సతమతమవుతున్నారు దాతలు ఎవరైనా ముందుకొచ్చి సాయం చేస్తారేమో అనుకొని ఎదురుచూస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ,మండలం,నందిపాడు గ్రామం ఉపాధి పనుల కోసం దేరంగుల ప్రసాద్ తన కుటుంబంతో కలిసి చీపురుగూడెంకు వ్యవసాయ పనుల నిమిత్తం శుక్రవారం సాయంత్రం వెళ్లారు. తమ ఐదేళ్ల పాప జాను పొరపాటున వేడివేడి నీళ్లలో పడటంతో శరీరంపై బాగా గాయాలయ్యాయి. వెంటనే పాపను కొత్తగూడెంలో చేర్పించగా అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ కు పంపించారు. ఇల్లు గడవక నానా యాతన పడుతున్న ఆ కుటుంబంపై మోయరాన్ని భారం పడింది. తమ పాప చికిత్స కోసం దాతలు దయార్త్ర హృదయం ఆపదలో ఆదుకునే పెద్ద మనసు కలిగిన వారు ఎవరైనా తమకు సాయం చేయకపోతారా అంటూ నిరీక్షిస్తున్నారు. దాతలు ఎవరైనా ఉంటే గొంది మంగరాజు 9398227663 నంబర్కు ఆర్థిక సాయం పంపించాలని వేడుకుంటున్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక




- **భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు**
- **భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జి వి రామిరెడ్డి**

**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ సెంటర్కు చెందిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు డివి శంకర్రావు హర్యానాలోని ఫరీదాబాద్ లో జరిగే జాతీయస్థాయి బెంచ్ ప్రెస్ పోటీలకు ఎంపికైనట్లు భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి తెలిపారు. ఖమ్మంలో జరిగిన రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్ ఛాంపియన్షిప్ పోటీలలో బంగారు పతకాన్ని సాధించిన శంకర్ రావు ఈ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ ఎంపికైన క్రీడాకారుడు గతంలో కేరళలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ లో నాలుగు బంగారు పతకాలు సాధించడం జరిగింది . ఈ పోటీలకు ఎంపికైన క్రీడాకారుని తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఉపాధ్యక్షులు వి మల్లేష్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు, భోగాల శ్రీనివాస్ రెడ్డి, పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, పట్టణ ప్రముఖులు, రాజకీయనాయకులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు , శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, సిటీ స్టైల్ జిమ్ సభ్యులు తదితరులు అభినందించడం జరిగింది.

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

**బిఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జ్యోతిబా పూలే విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక విద్య, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె చేసిన కృషి వేల కట్టలేనిదని కొనియాడారు. మహిళ చైతన్యాన్నికి ఆమె నిలువెత్తు సాక్ష్యం అని తెలిపారు, ఆమె ఆశయాలకు ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థి మిస్సింగ్

**కేసు నమోదు చేసిన శంషాబాద్ పోలీసులు**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ మండలంలోని సుల్తాన్ పల్లి గ్రామ పరిధిలోగల వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన కొత్త పల్లి ఆకాష్ వర్ధన్,(19) బీటెక్ మొదటి సంవత్సరంలో చదువుతున్నాడు ఈ సంవత్సరం జనవరి ఒకటో తారీకు రోజు రాత్రి 9:30 నిమిషాలకు బయటికి వెళ్ళొస్తానని వార్డెన్ ను కోరగా వార్డెన్ తమ అమ్మ పర్మిషన్ కావాలని చెప్పింది వెంటనే తన తల్లికి ఫోన్ చేయగా సరే పంపించండి అని చెప్పడంతో వార్డెన్ బయటికి పంపించాడు అటెండెన్స్ తీసుకునే సమయానికి ఆకాష్ వర్ధన్ కనిపించకపోవడంతో వాళ్ల అమ్మకు ఫోన్ చేయగా అతని దగ్గర ఫోను ఉన్నది ఆ ఫోన్ కు ఫోన్ చేయాల్సిందిగా కోరగా అతని ఫోను చేయగా ఫోను గదిలో తన బ్యాగులో రింగ్ కావడం తో తన స్నేహితుడు లిఫ్ట్ చేసి ఫోన్ ఇక్కడే మర్చిపోయాడని చెప్పడం జరిగింది వెంటనే అతనిని తన స్నేహితుల దగ్గర బంధువుల దగ్గర చుట్టుపక్కల ఆరా తీయగా ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో వెంటనే తన తల్లిదండ్రులు శంషాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఎల్.బి. నగర్ నియోజకవర్గంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి పాల్గొని సావిత్రిబాయి పూలే కి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా విద్యకు పునాదులు వేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేని కొనియాడారు.సమాజంలో సమానత్వం కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.నేటి యువత సావిత్రిబాయి పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్య, సమానత్వం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ముత్యాలమ్మ దేవస్థానంలో అన్న ప్రసాద వితరణ



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని మార్కండేయ నగర్ లో శ్రీశ్రీశ్రీ ఈశన్య ఇంద్రపాలా ముత్యాలమ్మ దేవాలయంలో శనివారం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు మాట్లాడుతూ అన్నదానానికి సహకరించిన దాతలు గుణగంటి యాదగిరి అండాలు, చింతకింది సాయిలు అండాలు,సుర్వి కృష్ణ జంగమ్మ,మలిగే ఊశయ్య రాములమ్మ,ఎర్రసాని సతీష్ శ్రావణి దంపతులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చింతకింది అంజయ్య గౌడ్,ముత్యాల భూపాల్ రెడ్డి,ఎరుకల భీమయ్య గౌడ్,ఎరుకల నరేష్ గౌడ్,చింతకింది శేఖర్ గౌడ్,ఉడుగు మల్లేష్ గౌడ్,పల్చం ఉత్తరయ్య ముదిరాజ్,మలిగే వెంకటేశం,పాశం రామాంజనేయులు ముదిరాజ్,పాలకుర్ల స్వామి గౌడ్,ముత్యాల మోహన్ రెడ్డి,చింతల మధుసూదన్ రెడ్డి,ఉడుగు వెంకటేశం గౌడ్,ఎల్లంకి పాండుగౌడ్,ఎరుకల మల్లేష్ గౌడ్,తొర్పునూరి మల్లేష్ గౌడ్,చెరుకు శివ గౌడ్,మారుపాక నాగరాజు,మారుపాక నరేష్,పల్చం సత్యం,లోకమోని మల్లేష్,సురిగి రాములు,భరత్ కుమార్,నరసింహ చారి,అనంతుల నరసింహ,ఎరుకల రాములు,రాజపేట శ్రీశైలం,ఎరుకల వెంకటేశం,మహిళలు ఆవుల అండాలు,బాలమణి,మారుపాక యాదమ్మ,కేతమ్మ , తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో మట్టా దయానంద్ జన్మదిన వేడుకలు

- **ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు**
- **ప్రజాసేవకు గుర్తింపుగా కార్యక్రమం**

**సత్తుపల్లి , విశాలభారతి :** సింగరేణి సంస్థలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖ వైద్యుడు డా. మట్టా దయానంద్ విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను సత్తుపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్టీయూసీ నాయకుడు తీగల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తీగల క్రాంతి కుమార్ మాట్లాడుతూ, డా. మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ఒక వైద్యుడిగా ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఆశా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందిస్తున్న నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అలాగే స్థానిక శాసనసభ్యులు డా. మట్టా రాగమయి దయానంద్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలకు నిరంతరం శ్రీకారం చుట్టారని కొనియాడారు. ప్రజాక్షేత్రమే తన కుటుంబంగా భావించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకురాలిగా ఆమె నిలిచారని తెలిపారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో రాష్ట్ర నాయకుడిగా డా. మట్టా దయానంద్ కీలక పాత్ర పోషించి ఐఎన్టీయూసీ యూనియన్ విజయంలో ప్రధానంగా నిలిచారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా డా. మట్టా రాగమయి దయానంద్, డా. మట్టా దయానంద్ నాయకత్వంలో సింగరేణిలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్టీయూసీ యూనియన్‌ను మరింత బలోపేతం చేస్తామని సింగరేణి కార్మికులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీలు నాగేశ్వరరావు, బాలాజీ, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ఐఎన్టీయూసీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి ఉద్యోగులు పాల్గొన్నారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.